వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 07 ఆగస్టు 2022


## ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి..

**కడప లీగల్, ఆగస్టు 6, ప్రభాతవార్త:**

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా (హర్ ఘర్ తిరంగ్) సందర్భంగా న్యాయ సేవా సదన్ కడప నుంచి ఏపీఎస్ ఆర్టీసీ రోడ్ల కూడలి వరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్ కవిత ర్యాలీ నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి సూచనల మేరకు దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా న్యా సేవా సదన్ కడప నుంచి ఏపీఎస్ ఆర్టీసీ రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో పారా లీగల్ వాలంటీర్లు, ఎన్జీవోలు, ప్యానల్ న్యాయ వాదులు, ప్రజలు పాల్గొన్నారు. ఆగస్టు 13వ తేదీ నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలని భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు అందరూ భాగస్వామ్యం అయి వారి వారి ఇంటిపై ఆగస్టు 14వ తేదీ నుంచి 15 వరకు మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.సోలమన్‌రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి కవిత ఒక ప్రకటనలో తెలిపారు.

## త్వరలో విద్యుత్తు రైళ్లు : విజయవంతంగా ట్రయల్ రన్

**ములకల చెరువు, ఆగస్టు 6, ప్రభాతవార్త:**

గుంతకల్లు రైల్వే డివిజనల్ పరిధిలోని ధర్మవరం నుంచి పాకాల వరకు విద్యుద్దీకరణ పూర్తయ్యాయి. శనివారం ఈ విద్యుద్దీకరణ పనులను కలికిరి నుంచి తుమ్మణంగుట్ట వరకు సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే పర్సనల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సోమశేఖర్ ఈ పనులను విద్యుత్తు రైలు ద్వారా పరిశీలించారు. మొదటి విడత ధర్మవరం నుంచి కదిరి వరకు, తరువాత చేపట్టిన పనులు కదిరి నుంచి తుమ్మణంగుట్ట వరకు, కలికిరి నుంచి పాకాల వరకు పనులు పూర్తయి ఉన్నతాధికారులు గురువారం రాత్రి చేపట్టిన ట్రయల్ రన్ విజయవంతంగా సాగింది. అయితే మళ్లీ విడత తుమ్మణంగుట్ట నుంచి కలికిరి వరకు కూడా ఈ విద్యుద్దీకరణ పనులు పూర్తి కావడంతో ధర్మవరం నుంచి పాకాల వరకు పూర్తి స్థాయిలో పనులు ముగిశాయి. విద్యుద్దీకరణ పనులు పూర్తి కావడంతో సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే పర్సనల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సోమశేఖర్ ఈ విద్యుదీకరణ పనులు పరిశీలించి ఒకే చెప్పినట్లు రైల్వే అధికారులు తెలిపారు. త్వరలో ఈ మార్గంలో విద్యుత్తు రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చిన్న చిన్న సాంకేతిక సమస్యలు ఉన్నాయని వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మురళీకృష్ణ, సీపీడీ నాగుల ప్రసాద్, సీఈడీఈ సి.హెచ్.ఎస్.రెడ్డి, సీఎస్ఈ గంగులి, సీనియర్ డీఈ మల్లికార్జున, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విఆర్వో ఆత్మహత్యా యత్నం

### నకిలీ పట్టాల్లో ఇరికించారని ఆవేదన!

### ఒక్కడినే దోషుడిగా చేస్తున్నారంటూ ఆక్రోశం

### నడి రోడ్డ మీద హల్‌చల్



ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేసిన విఆర్వో రవి కుమార్.

**బద్వేలు, ఆగష్టు 06 ప్రభాతవార్త :**

బద్వేలులో నకిలీ పట్టాల విషయంలో సంచలనం రేగి కొంత మందిని అరెస్ట్ చేసిన విషయం విధితమే. వారిలో విఆర్వో రవి కుమార్ అనే వ్యక్తిని ఇరికిస్తున్నారని ఆవేదనతో ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం నాలుగు రోడ్ల కూడలిలో లారీ కింద పడుకొని ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశాడు. అధికారులు తన పై ఒత్తిడి తెస్తున్నారని, తప్పు చేసినట్లు ఒప్పుకోకపోతే చర్యలు తీసుకుంటామంటూ బెదిరించడమే గాక, వ్రాతపూర్వకంగా వ్రాసి ఇవ్వాలంటూ బలవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రవి కుమార్ బి.మఠం మండల రేకలకుంట విఆర్వోగా పని చేస్తున్నారు. గతంలో గోపవరం మండలంలో పనిచేసిన రవి కుమార్ నకిలీ పట్టాల్లో ప్రధాన సూత్రదారుడంటూ కేసు నమోదు చేశారు. రవి కుమార్ జైలుకు కూడా వెళ్ళి వచ్చాడు. దీనిపై ఆవేదనకు గురైన రవి కుమార్ తనపైనే ఒత్తిడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎంతో మంది నకిలీ పట్టాల విషయంలో పాత్రదారులైనప్పటికీ తన మీద ముద్ర వేసి ఒప్పుకోవాలని చెప్పడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆత్మహత్య చేసుకుంటానంటూ కొద్ది సేపు హైడ్రామా నడిపించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని రవి కుమార్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. వినకపోవడంతో చివరకు రవి కుమార్‌ను బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్ళారు.

## జాతీయభావం, దేశభక్తిని ప్రతిబింభించిన చాయాచిత్ర ప్రదర్శన

### అజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు

### ఇన్‌చార్జి డిఆర్వో రామ్మోహన్



**కడప, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల ఛాయాచిత్రాల ప్రదర్శన ద్వారా.. ప్రతి ఒక్కరిలో జాతీయ భావం, దేశభక్తి పెంపొందుతాయని ఇంచార్జి డిఆర్వో రామ్మోహన్ పేర్కొన్నారు. "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" పక్షోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, పర్యాటక సాంస్కృతిక శాఖల సంయుక్త అద్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల ఛాయాచిత్ర ప్రదర్శనను డిఆర్వో రామ్మోహన్ కలెక్టరేట్ ఓఎస్డీ రఘునాథ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి డిఆర్వో మాట్లాడుతూ.. స్వతంత్ర్యోద్యమంలో అత్యంత కీలకపాత్ర పోషించిన జాతీయ నాయకుల ఘనతను, దేశ కీర్తిని చాటి చెప్పేలా ఏర్పాటు చేసిన ఛాయాచిత్రాలు నేటి సమాజానికి, ప్రత్యేకించి నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, పర్యాటక సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అన్నారు. జాతీయ నాయకుల సేవలను, స్వతంత్ర్యోద్యమంలో వారి పోరాట పటిమను, భారత దేశ కీర్తిని ప్రతిభిభించే ఇలాంటి ఫోటో చిత్రాల ప్రదర్శన నేటి సమాజానికి ఎంతో ఉపయుక్తం అన్నారు. కలెక్టరేట్ ఓఎస్డీ రఘునాథ్ మాట్లాడుతూ అజాదీక అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు.. జరిగే పలు రకాల సాంస్కృతిక పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 13వ తేదీ నుండి 15వ తేదీ వరకూ నిర్వహించే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని మహోత్సవ కార్యక్రమంగా నిర్వహించాలన్నారు. ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లును భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ జాతీయ పతాకాలను పంపిణీ చేస్తూ.. ప్రతి ఇంటిపై, సముదాయంపై జాతీయ పతాకాన్ని ఎగరవేసి "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా అన్ని శాఖలు, విభాగాలు ఫ్లాగ్ కోడ్‌ను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ సహాయ సంచాలకులు పి.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పర్యటక సాంస్కృతిక శాఖ అధికారి కుళ్ళాయి స్వామి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శివారెడ్డి, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సిబ్బంది పాల్గొన్నారు.

## సంచార జాతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

### నిరుపేద పిల్లల కోసం ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్‌మెంట్ అమోఘం

### జాతీయ సంచార జాతుల కమిషన్ సభ్యుడు తుర్క నర్సింహ, కలెక్టర్ గిరీషా పి.ఎస్.



**రాయచోటి, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

సంచార జాతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, జిల్లాలో సంచార జాతుల అభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ గిరీష్ పీఎస్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో సంచార జాతుల స్థితిగతులు, సంక్షేమం పై కలెక్టర్ గిరీష్ పీఎస్‌తో కలిసి జాతీయ సంచార జాతుల కమిషన్ సభ్యుడు తుర్క నర్సింహ సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత సంచార జాతుల స్థితిగతులపై సమీక్ష నిర్వహించడం ఇదే తొలిసారి అన్నారు. రాయలసీమ జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతమని, అందులో మన జిల్లాలో వెనకబడిన వర్గాల అభ్యున్నతికి అధికారులందరూ పాటుపడాలన్నారు. సంచార జాతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యా, వైద్యం, ఆర్థిక, సాంఘిక తదితర రంగాల్లో సంచార జాతులు ముందుకు వెళ్లడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా జాతీయ సంచార జాతుల కమిషన్ సభ్యుడు తుర్క నర్సింహ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న సంక్షేమ పథకాలు అట్టడుగున ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అనేది అట్టడుగున ఉన్న ప్రజలకు అందితేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనలో దేశమంటే మట్టి కాదోయో.... దేశమంటే మనుషులని అభివర్ణించారని, మానవసేవే మాధవ సేవ అని, మానవతా దృక్పథంతో అట్టడుగున ఉన్న సంచారజాతుల ప్రజలకు సేవ చేయాలన్నారు. అన్నమయ్య, పోతులూరి వీరబ్రహ్మం, వేమన లాంటి మహనీయులు మానవత్వం గురించి తెలియజేశారన్నారు. అన్నమయ్య జిల్లా దివ్య గడ్డ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు వారి స్థితిగతులను, జీవన అలవాట్లపై నివేదికకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఏ దేశంలో అయితే మానవ అభివృద్ధి చెందుతుందో ఆ దేశం ప్రపంచాన్నే శాసిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆంగ్ల బోధన, జగనన్న అమ్మ బడి, సెంట్రల్ సిలబస్, నిరుపేద పిల్లల కోసం ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ దేశంలోనే అమోఘం అన్నారు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టారని, ఆయన మన మధ్యలో లేకపోయినా ఫీజు రియంబర్స్మెంట్, ఆరోగ్యశ్రీ అద్భుతమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మానవ వనరులను తయారు చేయడంలో విద్య పాత్ర చాలా అమోఘం అన్నారు. మంచి విద్యా వ్యవస్థ మానవ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై లబ్దిదారులకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులను గుర్తించి వారి అభ్యునతికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో వారికి సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంచార జాతుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు అవగాహన కల్పించారు. సంచార జాతుల పిల్లలందరూ రాబోయే రోజుల్లో ఉన్నత విద్యను అవలీలగా చదువుకునే అవకాశాలు లభించాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. అది నెరవేరితే సంచార జాతుల జీవన విధానం పూర్తిగా మారిపోతుంది. ఆ పిల్లల చదువులు గొప్ప మానవ సంపదగా మారి, దేశ ఆర్థిక వ్యవస్థను మరింత శక్తివంతం చేసేందుకు దోహదపడతాయి అన్నారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం, సైన్స్, గణితం, రసాయన శాస్త్రం, సోషియల్ తదితర సబ్జెక్టులలో విద్యార్థులకు ఎలాంటి విద్యా బోధన ఉండాలి, ఎలా ఉంటే బాగుంటుంది, విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. అంతకుముందు కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ వారిని జాతీయ సంచార జాతుల కమిషన్ సభ్యుడు తుర్క నర్సింహ మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ సంచార జాతుల కమిషన్ సభ్యుడు తుర్క నర్సింహకు జిల్లా కలెక్టర్ ఆత్మీయ స్వాగతంతో పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ సత్యనారాయణ, రాయచోటి ఆర్ డిఓ రంగస్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, వివిధ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, సిపిఓ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల మేలు కోసమే సంక్షేమ పథకాలు

### రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా



**కడప, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

పేదల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగన్ ప్రభుత్వం చేస్తున్నదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని 15వ డివిజన్ 1వ వార్డులోని బహుజన్ నగర్, సాగర్ కాలని, ఎలక్ట్రిసిటి కాలనీ వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు పట్ల లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. లబ్ధిదారులకు చేకూరిన పథకాలను ముఖ్యమంత్రి సంతకం చేసిన బుక్‌లెట్ అందజేస్తూ వారి చేకూరిన ప్రయోజనాలను తెలిపారు. కరోనా కష్ట కాలంలోనూ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో సంక్షేమ పథకాలను ఆపలేదని అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఆర్యోగ్యశ్రీ, వాహనమిత్ర, వైఎస్సార్ వసతి దీవెన, వైఎస్సార్ విద్యాదీవెన, పేదలందరికీ ఇల్లుల వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనగ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ బాషా, ఆఫ్జల్ ఖాన్, మాసీమ బాబు, సోహైల్ బాషా, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, 15వ డివిజన్ కార్పొరేటర్ పూర లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్న జగన్ సర్కార్

### ప్రతి పేద విద్యార్థికి తప్పక విద్యను అభ్యసించాలి

### ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా



**కడప కార్పొరేషన్, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్ద పీట వేసి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక అల్మాస్ పేట లోని అల్మాస్ కళ్యాణ మండపము నందు అన్వర్- ఉల్- ఖురాన్ ఇంగ్లీష్ మీడియం, అరబిక్ మదరసా ముఫ్తి గౌస్ అహ్మద్ ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆధునిక విద్యతో పాటు ఇస్లాం దైవ విద్యా బోధనను కూడా అభ్యసించాలని అన్నారు. ఆధునిక విద్య తమను ఉన్నత స్థాయి ఎదిగేందుకు తోడ్పడుతుందని అలాగే ఇస్లాం దైవ విద్య బోధన తమ సన్మార్గంలో నడిచేందుకు దోహదపడుతుందని అన్నారు. ఇస్లాం యొక్క నియమ నిబంధనలు, ఆచారాలు, అలవాట్లు, ప్రవర్తన లపై విద్యార్థినీ విద్యార్థులకు తెలియచెప్పారు. మైనార్టీ ముస్లింలలో విద్యలో కొంత మేరకు వెనుకబడి ఉన్నారని తప్పక ఆధునిక విద్యతో పాటు ఇస్లాం దైవ బోధనను కూడా తప్పక అభ్యసించాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ప్రతి పేదవాడు ఉన్నత చదువు చదవాలనే ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న విద్య దీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే ఈ పథకాలు మదరసాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని ముఖ్యమంత్రిని కోరగా వెంటనే ఉత్తర్వులు జారీ చేసి అమలు చేయడం జరుగుతుందని ఈ ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికె దక్కుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పక చదివించు కోవాలని, తమ పిల్లలు కూడా తల్లిదండ్రులకు, తాము చదువుతున్న విద్యాలయానికి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొని రావాలని అన్నారు. తొలుత అన్వర్- ఉల్- ఖురాన్ ఇంగ్లీష్ మీడియం, అరబిక్ మదరసా విద్యార్థిని విద్యార్థులు దేశభక్తి నృత్య గీతాలాపన చేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్వర్- ఉల్- ఖురాన్ ఇంగ్లీష్ మీడియం, అరబిక్ మదరసా ముఫ్తి గౌస్ అహ్మద్, ఖాద్రి నిజామి, ముఫ్తి అజీమ్ అహమ్మద్, 30 వ డివిజన్ కార్పొరేటర్ షఫి అహ్మద్, అన్వర్- ఉల్- ఖురాన్ ఇంగ్లీష్ మీడియం, అరబిక్ మదరసా విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

### నూకలంటూ బుకాయించిన యజమాని

### అధికారుల నిఘా లేకపోవడంతో రేషన్ బియ్యం తరలింపు



రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న దృశ్యం.

**బద్వేలు, ఆగష్టు 06 ప్రభాతవార్త :**

బద్వేలులో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా కొంత మంది పట్టుకోవడం జరిగింది. అయితే అవి నూకలు అంటూ యజమాని బుకాయించడం జరిగింది. కానీ రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి వేరే సంచులలోకి మార్చి కోళ్ళ ఫారాలకు సరఫరా చేస్తుండగా బయటపడ్డాయి. కానీ అధికారుల నిఘా పూర్తిగా వైఫల్యం చెందడంతోనే రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నాయని పలువురు అంటున్నారు. రేషన్ బియ్యాన్ని నిల్వ చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నా రేషన్ బియ్యం పట్టుబడుతూనే ఉన్నాయి. శనివారం అనేక కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించడం జరిగింది. యజమాని మాటలు చూస్తుంటే రేషన్ బియ్యాన్నే ఇతర ప్రాంతాలకు తరలిస్తూ నూకలు అని చెబుతూ కొంత మందిని బుకాయించడమే గాక, బెదిరించినట్లు సమాచారం. దీంతో అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంప్




**కడప లీగల్, ఆగస్టు 6, ప్రభాతవార్త:**

న్యాయ సేవా సాదన్ కడప నందు శనివారం కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జాతతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహ పూర్వక న్యాయ సేవలు పథకం-2015 మరియు జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ (లీగల్ సర్వీసెస్ టు సీనియర్ సిటిజన్స్) పథకం 2016 సంబంధించి న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.సోలమన్ రాజు, 1వ అదనపు జిల్లా న్యాయమూర్తి సి.ఎన్.మూర్తి, మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.కవిత విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్ టోల్ ఫ్రీ నెంబర్ 14567 జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు సెక్రటరీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు ఆవిష్కరించడం జరిగింది. నల్సా పథకం గురించి వివరించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, టోల్ ఫ్రీ నంబరుకుపై అవగాహన కలిగించారు. తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం 2007 మంరియు ఏపీ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమం నియమావళి 2011 వివరించారు. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వృద్ధులను విడిచిపెట్టిన, పరిత్యాగం చేసే విధంగా బుద్ధి పూర్వకంగా వ్యవహరించిన అట్టి వవారు శిక్షార్హులు. శిక్ష కాలం గరిష్టంగా మూడు నెలలు జైలు శిక్ష లేదా అపరాధ రుసుం గరిష్టంగా రూ.5వేలు లేదా రెండింటికి విధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ కిశోర్, అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫిరెంట్లీ ఏబుల్ ట్రాంజెండర్స్ అండ్ సీనియర్ సిటిజన్స్, శ్రీనివాస్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్ఎస్‌పీవో, రమాదేవి ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐసీడీఎస్, సుభాష్ యాదవ్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, నారాయణ మండల విద్యాధికారి, సీనియర్ సిటిజన్స్, విద్యార్థినీ విద్యార్థులు, పారా లీగల్, వాలంటీర్లు, ఎన్జీవోలు రియు ప్రజలు పాల్గొన్నారు.

## జమ్మలమడుగు నుంచే పోటీ చేస్తా

### - నాపై పోటీకి జగన్ నిలబడ్డా గెలువలేడు..
### - ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నాకు ఒక లెక్కా..?
### - అవసరమైతే అందరినీ కలుపుకొని వస్తా
### - అమృత్ మహోత్సవ్ సభలో ఆదినారాయణరెడ్డి ఉద్ఘాటన..



**జమ్మలమడుగు, ఆగస్టు 6, ప్రభాతవార్త:**

వచ్చే ఎన్నికల్లో జమ్మలమడుగు నుంచి తాను పోటీకి సిద్ధమని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఉద్ఘాటించారు. అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జమ్మలమడుగులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను జమ్మలమడుగు నుంచి పోటీ చేస్తున్నానని, తనపై సుధీర్‌రెడ్డి నిలబడ్డా, జగన్ రెడ్డి నిలబడ్డా గెలువలేరని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రత్యర్థిని ఓడించడానికి అవసరమైతే తన కుటుంబ సభ్యులను అందరినీ కలుపుకొని పోతానని ఆయన పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పులివెందుల కంటే జమ్మలమడుగులోనే ఎక్కువ అభివృద్ధి జరిగిందని ఆయన వివరించారు. ఇది రాజశేఖర్ రెడ్డి ఘనత ఎంత మాత్రం కాదని, తాను కష్టపడి జమ్మలమడుగును అభివృద్ధి చేశానని ఆయన చెప్పారు. జగన్ సీఎం అయిన తరువాత రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, అంతా అప్పులే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

**రాష్ట్రంలో భారతి రాజజ్యాంగం నడుస్తోంది..**

ప్రస్తుతం మన రాష్ట్రంలో భారతీరెడ్డి రాజ్యాంగం నడుస్తోందని ఆదినారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. దోచుకో.. దాచుకో.. అన్న సిద్ధాంతాన్ని జగన్‌రెడ్డి అవలంబిస్తున్నాడని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ఆయన మాత్రం 5లక్షల కోట్లు వెనకేశాడని ఆరోపించారు. తనకు ఐదు చోట్ల ఇళ్లు ఉన్నాయని, పేదవాడి ఇంటికి ఐదు రెట్ల ఖరీదుతో ఒక్కో బాత్‌రూమ్‌ను నిర్మించుకున్నాడని వివరించారు. దేశాన్ని ప్రేమించాలని గురజాడ అప్పారావు పిలుపునిస్తే వైఎస్ఆర్‌సీపీ నేతలు ఆడవాళ్లను అసభ్యకరంగా ప్రేమిస్తున్నారని ఆయన వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అప్పుల అప్పారావుగా పేరు గాంచిన జగన్ పార్టీలో చివరకు గంట, అరగంట గాళ్లే మిగులుతారని.. ఆ పార్టీ 151 నుంచి 15 సీట్లకే పరిమితం అవుతుందని ఆదినారాయణంరెడ్డి జోస్యం చెప్పారు. వివేకానందంరెడ్డి హత్య కేసులో తనకే సంబంధం లేక పోయినా తనకు ముద్దాయిగా చేర్చారని వీరంతా కలిసి నా నన్ను ఏమిచేసుకోలేరని ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. వాస్తవానికి వైఎస్.వివేకా మాకు రాజకీయ గురువు అని అలాంటి వ్యక్తిని మేము హత మార్చడం ఏంటని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మోదీ ముందు మోకరిలే జగన్‌రెడ్డి ఇక్కడ మనముందు భీకరాలు ప్రదర్శిస్తుంటాడని ఆయన విమర్శించారు. జగన్ పోవాలి.. మోదీ రావాలి.. అనే నినాదంతో తాము ముందుకెళ్తున్నామని ప్రజలందరూ తమను ఆశీర్వదించాలని ఆదినారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పురుషోత్తం, శివనారాయణరెడ్డి, ఆదినారాయణరెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.30కోట్లతో వేంపల్లె జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాల

### అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి

**వేంపల్లె, ఆగస్టు 6, ప్రభాతవార్త :**

వేంపల్లెలోని జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో రూ.1.30కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణాల కోసం వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. స్థానిక గరుగువీధిలోని జడ్పీ స్థలం నందు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖాజా పర్వీన్ ఆధ్వర్యంలో 11 గదుల నిర్మాణంకోసం ఆయన భూమిపూజకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సంబంధిత కాంట్రాక్టరుకు ఆయన నిర్మాణ పనులపై సూచనలు ఇచ్చారు. అలాగే త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. అనంతరం జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉన్న సమస్యలను ప్రధానోపాధ్యాయురాలు ఖాజాపర్వీన్‌ను అడిగి తెలుసుకున్నారు. వాచ్‌మెన్ నియామకం, ఇతర వాటి గురించి చర్చించారు. జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెంపుదలలో మీ కృషి చాలా ఉందని రవికుమార్‌రెడ్డి ప్రధానోపాధ్యాయురాలు ఖాజా పర్వీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 230మంది ఉన్న విద్యార్థుల సంఖ్య 610కి చేరిందంటే కేవలం మీ పట్టుదలే కారణం అన్నారు. ఇక్కడ చదివిన ప్రతి విద్యార్థి ఉర్దూ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్ తరువాత డిగ్రీలో కూడా ఉర్దూ లాంగ్వేజిని మంజూరు చేయించానని, ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగాన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. వేంపల్లెలో 1 నుంచి డిగ్రీ వరకు ఉర్దూ పాఠశాల, కళాశాలలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ముస్లిం మైనార్టిలు ఉన్నతస్థాయి చదువులు కొనసాగిస్తే ఉద్యోగ అవకాశాలు ఎక్కువ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, సివిల్ సప్లైస్ డైరెక్టరు షబ్బీర్‌వలి, ఎంఈవో వీరారెడ్డి, ఉప మండలాధ్యక్షుడు బాబాషరీఫ్, షాదీఖానా కమిటి ఛైర్మన్ షేక్షావలి, మాజీ కోఆప్షన్ సభ్యులు బాబా ఫక్రుద్దీన్, అవాజ్ కమిటి సభ్యులు కరిముల్లా, కుమ్మరాంపల్లె సర్పంచి మునేష్‌కుమార్, పాఠశాల కమిటి ఛైర్మన్ రంతుల్లా, ఏఈ లోకేష్, సచివాలయ ఇంజనీర్ లక్ష్మిప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



వార్త IVవ పేజీలో

## మొహరం సందర్భంగా ఘనంగా పీర్ల ఊరేగింపు మహోత్సవం

ప్రొద్దుటూరు, ఆగస్టు 6

ప్రభాతవార్త :



ప్రొద్దుటూరు పట్టణం 25వ వార్డులోని మట్టి మసీదు వీధిలో వెలసిన పీర్లను మొహరం సందర్భంగా ఎంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా ఊరేగింపు ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ ప్రజల సుఖ సంతోషాలతో జీవించేలా జీవించాలని వారు వేడుకున్నారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో దస్బియా అండ్ సన్స్ అధినేత ఖాదర్ వలీ కుటుంబ సభ్యులు మరియు కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## భారతదేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల భాగంగా శ్రీ చైతన్య విద్యార్థుల భారీ ర్యాలీ

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 6

ప్రభాతవార్త :



భారతదేశ 75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన "ఆజాదీ కా అమృత్ మహోత్సవ "అంశాలకు అనుగుణంగా శ్రీ చైతన్య పాఠశాల చేపట్టిన ఉజ్వల్ భారత్ కార్యక్రమాన్ని స్థానిక బొల్లవరంలోని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం తమ విద్యార్థుల చేత దేశ స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో పాటు వారి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.దీనికి ముఖ్యఅతిథిగా ప్రొద్దుటూరు పట్టణ త్రీటౌన్ సీ ఐ ఆనంద రావు, ఏజీఎం నాగిరెడ్డి సంయుక్తంగా పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ సమరయోధుల పోరాట బలం, అమర వీరుల త్యాగఫలం, బ్రిటిష్ పాలకులపై తిరుగులేని విజయం అని చెప్పి అన్ని దేశాల కన్నా భారతదేశం మిన్న అని విద్యార్థులకు సూచించారు.శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం నాగిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరాన్ని జయప్రదంగా ముగించి స్వేచ్ఛ, స్వాతంత్ర్యలతో, సజీవమైన శక్తితో, అపరిమితోత్సాహంతో భారతదేశం తిరిగి ప్రతిభతో నిలవబోతున్నది అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినోద్ కుమార్ , కోఆర్డినేటర్ మురళీధర్ ,ఇన్చార్జిలు సుధాకర్, నాగేంద్ర, వరలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేనేతల ర్యాలీ

ప్రొద్దుటూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త :

జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎరుకలయ్య ఆశ్రమం నుండి గాంధీ రోడ్డు లోని గాంధీ విగ్రహం వరకు చేనేతలతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చేనేత ఐక్యవేదిక పేర్కొంది ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రతి చేనేత కుటుంబ సభ్యులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని చేనేత ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలిపునిచ్చిన వారిలో చేనేత ఐక్యవేదిక నాయకులు చెన్నా వెంకటకృష్ణయ్య వద్ది నరసింహులు బండారు సూర్యనారాయణ ఉట్టి నాగ శయనం బండారు రఘురామయ్య నందం లక్ష్మణకుమార్ రాగా నరసింహారావు మేరువ మూర్తి మరియు పద్మశాలి తొగట క్షత్రియ దేవాంగ కుల పెద్దలు ఉన్నారు.

## గృహనిర్మాణ లబ్ధిదారులకు అవగాహన

ప్రొద్దుటూరు, ఆగస్టు 6

ప్రభాతవార్త :



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 10 11 వార్డులలోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు కౌన్సిలర్ ఘర్షపాటి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జగనన్న ఇంటి నిర్మాణం పై అధికారులు శనివారం బొల్లవరం లేఅవుట్ లో 60 మంది లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు 1 లక్ష,80 వేల రూపాయలకు చెందిన గృహ నిర్మాణ వస్తువులు సిమెంటు ఇసుక ఇనుప కడ్డీలు ఇటుకలు తక్కువ ధరలకే లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇల్లు నిర్మించే మేస్త్రి దగ్గర నుండి కూలీలతో పాటు కౌన్సిలర్లు దగ్గరుండి ఇంటి నిర్మాణం పూర్తి చేయడానికి సహకరిస్తారన్నారు కావున లబ్దిదారులు సరితగ్గత ఇంటి నిర్మాణం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా టెక్నికల్ ఎక్స్పర్ట్ కేజియా, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేతలపై కపట ప్రేమను చూపిస్తున్న వైసిపి

**బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు**

ప్రొద్దుటూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని చేనేతలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిలు కపట ప్రేమను చూపిస్తున్నారని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు మండిపడ్డారు శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో చేనేతల జనాభా 11% ఉందని వారికి గౌరవం పొందేలా ఆగస్టు 7 న జాతీయ చేనేతల దినోత్సవం గా బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన సంగతి తెలిసిందేనన్నారు. ఈ సందర్భంగా ముందస్తుగా ప్రొద్దుటూరు నియోజవర్గ చేనేత కుటుంబాలకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అందులో భాగంగా చేనేతల అభివృద్ధి కోసం 1000 కోట్లతో వెయ్యి ఎకరాలలో ప్రతి రాష్ట్రానికి టెక్స్టైల్ పార్క్ లు నిర్మించుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు టెక్స్టైల్ పార్కుల కోసం కేంద్రానికి నివేదిక ఇచ్చిన తక్షణమే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు పురుగు వైసిపికి చేనేతలు అండగా నిలిచారని చెప్పుకునే అధికార పక్షం నాయకులు కనీసం చేనేతలను మనుషులుగా నైనా చూడండి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ బిజెపి ఆధ్వర్యంలో జమ్మలమడుగు ప్రొద్దుటూరు మధ్య టెక్స్టైల్ పార్కు నిర్మించుకునేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు పి సుబ్రహ్మణ్యం మండల ఉపాధ్యక్షులు ప్రకాష్ శరత్ బాబు రాజుపాలెం మండలం నాయకులు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

**బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు**

ప్రొద్దుటూరు, ఆగస్టు 6

ప్రభాతవార్త :



దేశానికి స్వాతంత్రం సిద్దించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఇంటికి జాతీయ జెండాను వితరణగా అందిస్తున్నామని బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు వెల్లడించారు శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచిన భారతదేశంలో ప్రతి ఇంటిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. అనంతరం నాయకులకు, కార్యకర్తలకు జాతీయ జెండాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు పట్టణ అధ్యక్షులు సుబ్రమణ్యం మరియు బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడూరులో భారీ వర్షం

రైల్వేకోడూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలో శనివారం సాయంత్రం ఆకస్మికంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. గత 2 రోజులుగా వాతావరణం చల్లగా ఉంటూ గాలులతోనే వర్షం పడకుండా ఉండిందని, అయితే శనివారం సాయంత్రం ఆకస్మికంగా ఈదురుగాలులు రావడం, భారీ వర్షం పడడంతో పట్టణంలో భారీగా మురికినీరు ప్రవహించింది. ఈ వర్షంతో పాదచారులకు ఇక్కట్లకు గురయ్యారు.

## పేదవాడికి అన్నం పెట్టడమే మహాభాగ్యంగా భావిస్తా

**సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్**

ప్రొద్దుటూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త :



ప్రొద్దుటూరులో ప్రతి పేదవాడికి ప్రయాణికులకు పట్టెడన్నం పెట్టడమే తనకు మహా భాగ్యమని తన శక్తి మేర నిరంతరం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తానని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్ పేర్కొన్నారు శనివారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా వారానికి ఒకసారి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని అందులో భాగంగా ప్రతి పేద వాడికి పాదచారులకు ప్రయాణికులకు పట్టెడు అన్నం పెట్టడమే తనకు కలిగిన భాగ్యమని తెలిపారు. పేదవాడు కడుపునిండా భోంచేసి భోజనం చాలా బాగుందని చెప్పడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రవి చౌడం రవి, రామచంద్ర రాజు శ్రీనివాసులు రమణ జయచంద్ర రాఘవ ప్రసాద్ రామయ్య గౌడ్ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

**ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి**

ప్రొద్దుటూరు, ఆగస్టు 6

ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద వర్గాల అభివృద్ధిని కాంక్షించి చేపట్టిన సంక్షేమ పథకాలు ఫలాలు పారదర్శకంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐదో వార్డులో వార్డు వైసిపి ఇన్చార్జ్ నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ప్రతి ఇల్లు తిరిగి సంక్షేమ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను తెలుసుకుని అధికారులతో చర్చించి అక్కడికక్కడే సమస్యకు పరిష్కారం చూపుతున్నారు. గత మూడు సంవత్సరాల కాలంలో ఐదవ వార్డుకు మహిళలకు నేరుగా ఖాతాలలో జమ చేసిన సంక్షేమ పథకాల నగదు సుమారు 7 కోట్ల 77 లక్షలు అధికారుల సమాచారం. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మున్సిపల్ కమిషనర్ పీవీ రమణయ్య కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి ఇర్ఫాన్ భాష సీనియర్ నాయకులు కాకర్ల నాగ శేషారెడ్డి సాగర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి పట్టణ అధ్యక్షులు కామిశెట్టి బాబు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండా ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పంప్ సెంట్లకు విద్యుత్తు మీటర్లు రద్దు చేయాలి

కడప వైద్య విభాగం, ఆగస్టు 6,

ప్రభాతవార్త:



గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉపాధి హామీ, భూ సమస్యలు వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్తు మీటర్లను రద్దు చేయాలని కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు వామపక్ష రైతు వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు అన్వేష్, దస్తగిరిరెడ్డి, సుబ్రమణ్యం, శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వామపక్షాల పోరాటంతో సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఆహార భద్రత చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్వీర్యం చేస్తోందని వారు తెలిపారు. రైతులకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర మద్దతు ధర చట్టం తీసుకురావాలని వారు తెలిపారు. ధర్నాలో జిల్లా ప్రజానీయం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## సీఎం సొంత జిల్లాలనే అక్రమ చేపల వేట

**టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రాంప్రసాద్**

కడప వైద్య విభాగం, ఆగస్టు 6,

ప్రభాతవార్త:



సీఎం జగన్మోహన్‌రెడ్డి సొంత జిల్లా కడప జిల్లాలో అక్రమ చేపల వేట కొనసాగుతోందని ఇకనకడ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు యాటగిరి రాంప్రసాద్ శనివారం తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు నెలల పాటు జులై, ఆగస్టు నెలల్లో చేపలు గుడ్లు పెట్టే సమయం కాబట్టి వేట నిషేధాన్ని అమలు చేసిందన్నారు. మత్స్య సంపదను కాపాడాల్సిన మత్స్య శాఖ కనుసన్నల్లోనే సోమశిల తదితర ప్రాంతాల్లో ఫిష్ మాఫియా చెలరేగి పోతోందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఇతర శాఖ అధికారులతో సోమశిల ప్రాంతాల్లో విచారణ, దాడులు చేసి మత్స్య సంపదతో పాటు చేపల వృత్తిపై ఆధారపడిన మత్స్యకారుల జీవనానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం మత్స్యకారులతో కలిసి జిల్లా కలెక్టర్ వారికి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మానా చంద్రశేఖర్, ఆఉవల వెంకటేష్, పోలి శివ, పిల్లి సూరి, మద్ది గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ బీసీ సంక్షేమ అధికారిని నియమించాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 6, ప్రభాతవార్త:



కడప జిల్లాకు రెగ్యులర్ బీసీ సంక్షేమ జిల్లా అధికారి డీబీసీడబ్ల్యూఓని నియమించాలని ఏపీ విద్యార్థి సంఘం ఏపీ ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు జయవర్ధన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు గత 2 సంవత్సరాలుగా రెగ్యులర్ డీబీసీడబ్ల్యూఓ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జిల్లా అధికారి పరిరక్షణ లేక విద్యార్థులకు అందాల్సిన పౌష్టికాహారం అందడం లేదని ఇన్‌ఛార్జి పాలనకు స్వస్తి పలికి రెగ్యులర్ డీబీసీడబ్ల్యూఓ నియమించాలని ఆయన కోరారు. కడప జిల్లాకు రెగ్యులర్ డీబీసీడబ్ల్యూఓను నియమించి ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్సీ జిల్లా నాయకులు వినోద్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.

## మైదుకూరు బిజెపి నియోజకవర్గం ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

మైదుకూరు, ఆగస్టు 6

ప్రభాతవార్త :



బిజెపి మైదుకూరు నియోజకవర్గం ఇంచార్జ్, మాచనూరు సుబ్బరాయుడు, ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. బీజేవైఎం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, యువ సంఘర్షణ యాత్రలో భాగంగా మైదుకూరు లోని శ్రీకృష్ణదేవరాయల నాలుగు రోడ్ల సర్కిల్ నందు యువ సంఘర్షణ యాత్ర తిరుపతి నుండి బయలుదేరి మైదు కూరుకు వచ్చిన సందర్భంగా బిజెపి మైదుకూరు నియోజకవర్గం ఇంచార్జ్ మాచ నూరు సుబ్బరాయుడు, నాయకులకు స్వాగతం పలికారు. మైదుకూరు బిజెపి భారతీయ జనతా పార్టీ నాయకులు మరియు బీజేవైఎం నాయకులు కార్యకర్తలు మైదుకూరు నుంచి పొద్దుటూరు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చాపాడు మండలపరిధిలోని విశ్వనాథ పురం, బద్రిపల్లె, కేతవరం, చాపాడు, పల్లవోలు, నాగులపల్లె ల మీదుగా ప్రొద్దుటూరు కు ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులతో పాటు కడప జిల్లా బిజెపి ఇంచార్జ్ అంకాలరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరవేటి హరికృష్ణ, బిజెపిమైదుకూరు నియోజకవర్గం ఇంచార్జ్ మాచనూరుసుబ్బరాయుడు, చాపాడు బిజెపి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులుబొగ్గుల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి భూమి రెడ్డి భాస్కర్ రెడ్డి, లక్ష్మయ్య, కోదండరామయ్య, వెంకటేశ్వర్ రెడ్డి భారీ ఎత్తున కార్యకర్తలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

## సత్యకుమార్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

**పాలగిరి శ్రీనివాసరాజు**

రాయచోటి రూరల్, ఆగస్టు 6,

ప్రభాతవార్త :



జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పై రాయచోటి స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి వ్యక్తి గత ఆరోపణలు ఆపి రాయచోటి అభివృద్ధి పై దృష్టి పెట్టాలని బారతీయ జనతా పార్టీ రాష్ట్ర మేధావుల విభాగం పాలగిరి శ్రీనివాస రాజు ,పట్టణ అధ్యక్షుడు నిర్మల్ కుమార్ లు తెలిపారు .అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో పట్టణ అధ్యక్షుడు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మట్లాడుతూ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ఒకే పార్టీలో ఉంటు ఒకే విధానం,ఒకే జాతీయ వాదంతో వుండే వ్యక్తి అసత్య ఆరోపణలు చేయడం బారతీయ జనతా పార్టీ శాఖ తరపున మేము ఖండిస్తున్నామన్నారు .అటువంటి వ్యక్తి పై శ్రీకాంత్ రెడ్డి ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో మాకైతే అర్థం కాలేదన్నారు. మీరు తమ నాయకుని పై అసత్య ఆరోపణలు చేయడం పై దృష్టి పెట్టడం కన్న రాయచోటి అభివృద్ధి పై దృష్టి పెట్టాలని సూచించారు. భాజాపా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆనంద్ గజపతి రాజు,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెపన శివ ప్రసాద్ లు పాల్గొన్నారు.

## బహుజనులుపై దాడులు ఆగాలంటే రాజ్యాధికారమే పరిష్కారం

**- పౌర హక్కుల సంఘం**

రాయచోటి రూరల్, ఆగస్టు 6ప్రభాతవార్త:

గుంటూరు జిల్లాలోని చుండూరులో దళితులపై మారణకాండ జరిగి గత మూడు దశాబ్దాలుఅవుతున్నా నిందితులు ఎవరో ఇప్పటికీ తేల్చలేని ప్రభుత్వాలు దళితుల సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని పౌర హక్కులసంఘం, సమత సైనికదల్ నాయకులు పేర్కొన్నారు. దీనికి బహుజనులు రాజ్యాధికారంలోకి రావడమే పరిష్కారమన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నాయకులు ఆర్. రవిశంకర్, రెడ్డెయ్య, సమత సైనికదల్ నాయకులు ఎం. ఆనంద్, ఎం. రవిశంకర్, బహుజన టీచర్స్ నాయకులు అబ్దుల్, రజాక్, ఎలక్ట్రిక్ సంఘ నాయకులు, అస్లం, ముస్లిం నాయకులు నాయమత్, రాజ, ఎస్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవితానికి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రామాపురం, ఆగస్టు 6ప్రభాతవార్త:



ప్రతి మనిషికి ఆరోగ్యం చాలా విలువైందని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ వ్యవంతమైన జీవితం అనుభవిం చవచ్చునని సరస్వతి పల్లె పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని సరస్వతిపల్లి గ్రామ పంచాయతి దళితవాడలో శనివారం ఆజాదిక అమృత మహోత్సవ భాగంగా గ్రామంలో స్వ చ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మురికి కాలు వలో పూడిక తొలగింపు కార్యక్రమం ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషికి విలువైనది ఆరోగ్యం దాన్ని కాపాడుకోవడానికి తన పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు రాణి, ఆశా వర్కర్లు, ఉమా మహేశ్వరి, గ్రీన్ అంబాసిడర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌పై అవగాహన వర్క్‌షాప్

గాలివీడు, ఆగస్టు 6ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థినీ విద్యార్థులకు సైన్స్ పై అవగాహన కల్పించే దిశలో స్థానిక రవిచంద్ర ఉన్నత పాఠశాలలో రూరల్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ సొసైటి అధ్యక్షులు బండ్లపల్లి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ప్రయోగాత్మక శిక్షణలో భాగంగా ఉపాధ్యాయ బృందానికి లోకాస్ట్ టీచింగ్ కిడ్స్ ఆ సంస్థ అధ్యక్షులు, సామాజిక సేవకుడు మదన మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ అవేర్నెస్ ప్రోగ్రాం కింద పిల్లలకు ప్రయోగాత్మక విద్య బోధించే దిశలో సైన్స్ సరికరాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల యాజమాన్యం సింటో, థామస్, ఉపాధ్యాయులు రమేష్, రామమోహన్, ఆంజనేయులు, అక్తర్ పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పెయింటింగ్, వక్తృత్వ పోటీలలో జిల్లా స్థాయి విజేతలు వీరే

రాయచోటి, ఆగస్టు 6ప్రభాతవార్త:



ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో ఈనెల 5న సాయిఇంజనీరింగ్ కళాశాల నందు నిర్వహించిన పెయింటింగ్, వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థుల జాబితాను అన్నమయ్య జిల్లా డిఈవో ఎద్దుల రాఘవరెడ్డి శనివారం మధ్యాహ్నం విడుదల చేశారు. పెయింటింగ్ పోటీలలో ప్రథమ స్థానాన్ని గాలివీడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎస్ మిస్బా ఫాతిమా పొందగా, రెండవ స్థానాన్ని పెనగలూరు మండల నల్లపరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ తేజ, మూడవ స్థానాన్ని మదనపల్ల మండలం మున్సిపల్ ఉర్దూ స్కూల్ విద్యార్థిని షేక్ జూహా కైవసం చేసుకున్నారు. అలాగే వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానాన్ని అంగళ్ళులోని విశ్వం హైస్కూల్ విద్యార్థి లలిత్ సింగ్ పొందగా, రెండవ స్థానాన్ని కె.వి.పల్లి మండలం గ్యారంపల్లెలోని ఏపి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి ఎస్. వేణు, మూడవ స్థానాన్ని రాయచోటి మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఎండి అబ్దుల్ గయూమ్ కేవసం చేసుకున్నారు. వీరందరికీ ప్రశంసాపత్రంతో పాటు బహుమతులను ఆగస్టు 15వ తేదీ రాయచోటిలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నందు అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా డిఈవో తెలిపారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

వీరబల్లి, ఆగస్టు 6ప్రభాతవార్త:



తల్లి మురిపాలు బిడ్డకు శ్రేష్టమైనవని అంగన్వాడీ సూపర్‌వైజర్ చెన్న య్య తెలిపారు. శనివారం సీతంపేట షెక్టారు అంగన్వాడీ టీచర్లు కలిసి గుర్ర ప్పగారిపల్లె పంచాయతీలో కొత్త వడ్డెపల్లెలో ప్రాథమిక పాఠశాలలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా వీరబల్లి మండల కేం ద్రంలో వీరబల్లి పంచాయతీలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు కలిసి తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే మురిపాలు త్రాగించాలని తెలిపారు. మూడు నమ్మకాలు నమ్మకుండా త్రాగించాలన్నారు. బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎటువంటి జబ్బులు రావన్నారు. తల్లి పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రభుత్వం అందించే పోషక పదార్థాలను తల్లులు, గర్భవతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తను పరామర్శించిన ప్రసాద్‌బాబు

సంబేపల్లి, ఆగస్టు 6ప్రభాతవార్త:



మదనపల్లెలో జరిగిన మినీ మహానాడుకు హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన కర్రాటి కృష్ణయ్యను మాజీ టిటిడి పాలక మండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు శనివారం పరామర్శించారు. శనివారం కృష్ణయ్య స్వగ్రామమైన ఎస్. సోమవరం గ్రామం అగ్రహారానికి మాజీ సర్పంచ్ నారా ప్రభాకర్‌నాయుడు, టిడిపి నాయకులు వేణుగోపాల్‌నాయుడుతో కలిసి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈశ్వరయ్య, సుగవాసి శ్రీనివాసులు, బాబునాయుడు, ప్రసాద్ నాయుడు, కిషోర్ చౌదరి, రోహన్‌నాయుడు, రాహుల్ నాయుడు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం ఎంతో పుణ్యకార్యం

**ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్**



భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

వేంపల్లె, ఆగస్టు 6, ప్రభాతవార్త :

అన్నదానం ఎంతో పుణ్యకార్యం అని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ అన్నారు. శనివారం శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా గండి క్షేత్రంలో ఎమ్మెల్సీ అభిమానులు ఆర్‌వీఎస్ యూత్ సభ్యులు బడిగింజల రెడ్డెయ్య, వెంకి సుబ్బులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. అన్నదానం ఏర్పాటు చేసిన బడిగింజల రెడ్డెయ్య, వెంకి సుబ్బులను ఆయన అభినందించారు.

## తల్లిపాలు బిడ్డలకు జీవామృతం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 6,

ప్రభాతవార్త:



ఆగస్టు నెల మొదటి వారమంతా జరిగే తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఫాతిమా వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలిపే గోడ పత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డా.గిరిధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 88% మహిళలు ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకుంటున్నారని అందులో 55% మంది ఒక్క గంట వ్యవధిలోనే బిడ్డకు పాలిస్తున్నారు. అదే విధంగా 0-6 నెలల బిడ్డలకు 72 శాతం తల్లులు సమృద్ధిగా పాలు ఇస్తున్నారని వివిధ సర్వేల ద్వారా తెలియవస్తోందన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలు వివిధ పోషకాల లోపం వలన 28 శాతం ఎక్కువ బరువు ఉన్న వారు, 34 శాతం సరైన ఎదుగుదల లేని వారు, 19 శాతం ఎత్తుకు తగిన బరువు లేకుండా, 6 % ఊబకాయం గల పిల్లలు ఉన్నారని, తల్లి పాలు తాగే పిల్లల కంటే తాగని పిల్లల మరణాలు 5 నుంచి 10 రెట్ల ఎక్కువగా సంభవిస్తాయని అత్యంత పోషకాహారం గల తల్లిపాలు ఇవ్వడం వలన ప్రతి సంవత్సరం 9లక్షల మంది పసి ప్రాణాలను కాపాడుకోవచ్చని డాక్టర్ గిరిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమ్యూనిటటీ మెడిసిన్ విభాగం సహా ఆచార్యులు డా.చంద్రశేఖర్, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డా.రామ్ మనోహర్‌రెడ్డి, మెడికల్ సోషల్ వర్కర్ సుబ్రమణ్యం, జూనియర్ వైద్యులు అలీం, అకీల్, రషీద్, ఆర్షియా, ఆయేషా, డింపుల్ డేవిడ్, షోహరత్, సిబ్బంది పుష్పలత, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత సంతాన సాఫల్య శిబిరం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 6, ప్రభాతవార్త:

కడప నగరంలో ఆదివారం ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాదులో ఉన్న ప్రముఖ అవిని ఫెర్టిలిటీ ఆసుపత్రి స్పెషలిస్ట్ డా.హేమారెడ్డి, కడపలోని నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహిస్తున్న సంతాన సాఫల్య ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఉచిత సంతాన సాఫల్య శిబిరానికి సంబంధించిన వివరాలను వారు తెలిపారు. నాగరాజుపేటలోని రాజీవ్ గాంధీ నగర్ (స్మిత్ రోడ్డు), ఎంఎస్టీసీ క్యాంపస్ వద్ద గలనిమార్ మల్లీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగానే ఫోన్ కాల్ ద్వారా సంప్రదించి తమ పేర్ల నమోదు చేసుకోవాలని తెలిపారు. 9492137800, 8563446666 నెంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

## ప్రహరీ గోడ లేక అధ్వాన్నంగా గ్రంథాలయ భవనం

చింతకొమ్మదిన్నె ఆగస్టు, 6 ప్రభాతవార్త



ప్రహరీ గోడ లేని గ్రంథాలయం

ఎ భవనానికైనా ప్రహరీగోడ లేకుండా భవనం నిర్మిస్తే అ భవనం అస్తవ్యస్తం గా మారుతుంది. ప్రహరి గోడలేక గ్రంథాలయ భవనం అధ్వాన్నంగా మారింది. మండల పరిదిలోని గ్రంథాలయ భవనం 2000 సంవత్సరంలో నిర్మానం జరిగింది. నాటినుండి నేటివరకు అ భవనానికి ప్రహరి గోడ లేక పోవడంతో గ్రంథాలయ భవనం చుట్టూ మళ్ల పొదలు ఎపుగా పెరిగాయి. దీంతో భవనం చుట్టూ విష పురుగులు తిరుగుతుండటంతో గ్రంథాలయానికి వెల్లాలంటే పాఠ కులు బయబ్రాంతులకు గురవుతున్నారు. కిటికీలు కూడా దెబ్బతినడంతో కిటికీల గుండా విషపురుగులు గ్రంథాలయంలోకి వస్తాయని అధికారులు అవేదన చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అదికారులు గాని ప్రజా ప్రతినిధులు గ్రంథాలయ భవనానికి ప్రహరి గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## తల్లిపాల వారోత్సవాలు

నందలూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతిలో ఉన్న అన్ని అంగన్వాడి సెంటర్లలో శనివారం ఉదయం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆయా సెంటర్లలో తల్లులు, పిల్లలు పాల్గొన్నారు. ఆగస్టు 1వ తేది నుండి 7వ తేది వరకు ఈ తల్లిపాల వారోత్సవాలు నిర్వహణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను పౌష్టికాహారం అందేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు షన్ముఖవల్లి, విజయ, మమత, అరుణ, లక్ష్మీదేవి, సచివాలయ ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, అంగన్వాడి కార్యకర్తలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

## కొండ గోపాలస్వామిని దర్శించుకున్న భక్తులు

అట్లూరు, ఆగస్టు 06 ప్రభాతవార్త :



మండలంలోని బద్వేలు-కడప ప్రధాన రహదారిలోని రెడ్డిపల్లె పరమట లంకమల్ల అభయారణ్యంలో వెలసివున్న శ్రీ కొండ గోపాలస్వామి రెండవ శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు జిల్లా నుండే కాక, ఇతర జిల్లాల నుండి కాలి నడకన కొండ గోపాలస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో ఎంతో వైభవంగా నిర్వహించే ఉత్సవాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనడం జరుగుతుంది. రెడ్డిపల్లె సుమారు 10 కిలోమీటర్లు కాలి నడకన కొండ ప్రాంతాలలో ఎంతో భక్తి శ్రద్ధలతో కొండ గోపాలస్వామికి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది.

## అన్నమయ్య జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఎం. చిదంబర రెడ్డి

సంబేపల్లి, ఆగస్టు 6ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా చిదరబరెడ్డిని నియమిస్తూ రాయచోటి ఎమ్మెల్యే, శాసన మండలి సమన్వకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సంబేపల్లి మండలం గుట్టపల్లి సర్పంచ్‌గా ఉన్న ఆయన నియోజక వర్గ వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడంతో ఆయనకు ఈ పదవి వరించినట్లు తెలిపారు. సర్పంచ్‌ల సమస్యలపై తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే శ్రీఖాంత్‌రెడ్డికి, రాజంపేట ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డికి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీనివాసులుకు, స్థానిక నాయకులకు డిసిఎంఎస్ మాజీ చైర్మెన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డికి, మండల అధ్యక్షురాలు ఆవుల నాగలక్ష్మికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటిది

ఎంపీహెచ్ఈవో వెంకటరమణ

**తంబళ్లపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



అప్పుడే పుట్టిన బిడ్డకు (ముర్రుపాలు) తల్లిపాలు అమృతంలా పనిచేస్తాయని ఎంఎంహెచ్ఈవో వెంకటరమణ సూచించారు. శనివారం కోసువారిపల్లి పంచాయతీలోని తరుగువారిపల్లి, వడ్డిపల్లి, కొప్పలవారిపల్లి, కోసువారిపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలల్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉండి పుట్టిన బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదుగుతాడని సూచించారు. ఆరు మాసాల అనంతరం బిడ్డకు పోషక విలువలు గల ఆహారాన్ని అందించాల్సి ఉందన్నారు. బిడ్డల పెంపకంపై తల్లి ప్రత్యేక శ్రద్ధ చూపి పోషకాహారం అందించడంతో పాటు సకాలంలో అంగన్‌వాడీలో అందించే ఆహారాన్ని ఇచ్చి తరచూ వైద్యసేవలతో పాటు టీకాలు తప్పక వేయించాలన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలపై గ్రామాల్లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, తల్లిబిడ్డలు ర్యాలీలో పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు శోభ, సుజాత, పార్వతి, ప్రభావతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తంబళ్లపల్లె-శివపురం రోడ్డుకు అనుమతివ్వండి

డీఎఫ్‌వోతో ఎమ్మెల్యే

**తంబళ్లపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



తంబళ్లపల్లె నుండి శివపురం రోడ్డుకు ఫారెస్టు అనుమతులు ఇస్తే యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మించి జిల్లా కేంద్రానికి దగ్గర దారవుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి జిల్లా ఫారెస్టు అధికారి చైతన్యకుమార్‌రెడ్డిని కోరారు. డీఎఫ్‌వో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి స్వగృహంలో ఆయనతో మర్యాదపూర్వకంగా కలసి మల్లయ్యకొండకు రోడ్డు సౌకర్యం, శివాలయం పున:నిర్మాణం, పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్, నీటి ట్యాంకు నిర్మాణాలు చేపట్టడంపై ఎమ్మెల్యే కృషిని కొనియాడారు. మల్లయ్యకొండ రోడ్డుతో పాటు శివపురం రోడ్లకు అనుమతి ఇచ్చేలా తనవంతు కృషి చేస్తానని డీఎఫ్‌వో ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. శివపురం రోడ్డు నిర్మాణం జరిగితే పెద్దమండ్యం, గాలివీడు, చిన్నమండ్యంతో పాటు జిల్లా కేంద్రం రాయచోటికి మరింత దగ్గర ప్రయాణం అవుతుందని మారుమూల గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్ల నిర్మాణాలు పూర్తి కావడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అధికారులు సైతం తనకు సహకరించాలని డీఎఫ్‌వోను కోరారు.

# విద్యుత్ మీటర్లపై ఆందోళన అవసరం లేదు

డిస్కం ఎస్ఈ క్రిష్ణారెడ్డి

**మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు బిగించే మీటర్లపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిస్కం ఎస్ఈ క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం రూరల్ మండలంలోని పోతబోలు జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న విద్యుత్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటర్ల వల్ల రైతులపై ఎలాంటి భారం ఉండదన్నారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరాచేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. హౌసింగ్ పథకం కింద మంజూరైన లేవట్లలో గృహవిద్యుదీకరణ పనులు వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మదనపల్లె డిస్కం ఈఈ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి 9గంటలు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి వ్యవసాయ రంగంలో వచ్చే లోటుపాట్లను యుద్ధప్రాతికంగా సరిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఈఈ విజయ, డిఈ రాజశేఖర్‌రెడ్డి, ఏఈలు ఆర్ఎల్.నరిసంమారెడ్డి, రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఉన్న షాదీమహాల్

జోరందుకొన్న అసాంఘీక కార్యక్రమాలు

**నిమ్మనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



ముస్లింల కోసం నిర్మించిన షాదీమహాల్ నిరుపయోగంగా మారింది. చుట్టూ ముళ్ళపొదలు పెరిగాయి. రాత్రిపూట అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయిన స్థానికులు వాపోతున్నారు. షాదీమహాల్‌కు మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు అధికారులను కోరిన పట్టించుకోకపోవడంతో మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని తవళం రోడ్డులో ముస్లింలకు సౌకర్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో 2003లో షాదీమహాల్ నిర్మాణం చేపట్టారు. దాతలు షఫీవుల్లాఖాన్, జాఫర్ అలీఖాన్, మహబూబ్‌బాషాఖాన్, అన్వర్‌ఖాన్ స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. సర్పంచ్ మల్లప్ప భవనాన్ని పూర్తి చేశారు. పూర్తి అయిన తరువాత మసీదు కమిటీకి అప్పగించారు. నీటి సౌకర్యం లేకపోవడంతో ముస్లిం వివాహలు జరిగేందుకు ముందుకు రాలేదు. తరువాత దీనిని పట్టించుకునేవారు లేరు. దీంతో అందులోని సామాగ్రి కూడా చోరీ గురయ్యాయి. ప్రస్తుతం భవనం చుట్టూ ముళ్ళ పొదలు పెరిగాయి. ఈ షాదీమహాల్‌ను ఉపయోగంలోకి తెచ్చేందుకు అధికారులు, ముస్లిం పెద్దలు చొరవ చూపకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, అధికారులుకాని స్పందించి ఈ మహాల్‌ను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రతి ఒక్కరూ ఆద్యాత్మిక చింతన కలిగి ఉండాలి

ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

**కురబలకోట, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



ప్రతి ఒక్కరూ ఆద్యాత్మిక చింతన కలిగి ఉండి సన్మార్గంలో నడవాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం కురబలకోట మండలంలో ముదివేడు వద్ద నూతన మసీదు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో నిర్మించుకొన్న మసీదును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకోవడంతో వారిని అభినందించారు. గ్రామాభివృద్ధికి కావాల్సిన సదుపాయాలను కల్పిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దస్తగిరిసాబ్, జడ్పిటిసి బైసాని జ్యోతి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఫిరోజ్‌ఖాన్, రాజశేఖర్, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, గ్రామ సెక్రటరీ, విఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి ముంగిటికే సంక్షేమ ఫలాలు

గడప గడపలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

**పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త :**

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. పిటిఎం మండలంలోని రావూరివారిపల్లె పంచాయితీ పరిధిలో నారాయణవారిపల్లె, కొత్తపల్లె తదితర గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. గడపగడప కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా పథకాలు అర్హులైన పేద వారికి ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ప్రజల గుండెల్లో ఉండిపోయారని కొనియాడారు. ప్రతి ఒక్కరితో పలకరించి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం రావూరివాండ్లపల్లెలో రైతుబరోసాలచే గోదావరి యూరియా బస్తాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, జడ్పిటిసి శివన్న, ఎంపిడిఓ గిరిధర్‌రెడ్డి, ఏఓ ప్రేమలత, జేఈ హరి, వైస్ ఎంపిపి పుష్ప, కృష్ణవేణి రాజారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ జయ చంద్రారెడ్డి, ఆర్‌బికె భాస్కర్‌రెడ్డి, విండో ఛైర్మెన్ సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్‌లు శ్రీదేవి, సుబ్బిరెడ్డి, అనసూయ, మంజునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గౌతంరెడ్డి, ఎంపిటిసి కార్యం చంద్ర, జిల్లా ప్రచారకార్యదర్శి అయూబ్, వైసిపి నాయకులు డ్రిప్ రమణ, సాదిక్‌బాషా, సచివాలయ సిబ్బంది, వార్డు వాలెంటీర్లు పాల్గొన్నారు.

# దీక్షపై పదిరోజులైనా పట్టించుకోరా

తెలుగు యువత నాయకుల ఆగ్రహం

**తంబళ్లపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



ఎస్సీ వర్గీకరణ కోసం పదిరోజుల నుండి వానకు వెరవకుండా నిరసన దీక్ష చేస్తున్న మాదిగ సోదరుల గోడు పట్టించుకోరా అని మండల తెలుగుదేశం యువత నాయకులు ఆగ్రహించారు. శనివారం యువత నాయకులు మధుసూదన్, నరసింహులు, శివ, శంకర తదితరులు వారి నిరసన దీక్షకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గ ఇన్‌చార్జి వేటా మల్లికార్జునలు కృతజ్ఞతలు తెలుపుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు బీజేపీ వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత చేసేంతవరకు ఈ నిరసన దీక్షలు కాస్త నిరాహార దీక్షకైనా సిద్ధపడుతామన్నారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే భవిష్యత్తులో వారి పతనానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. ఈ దీక్షలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు జగదీష్, గోపిదిన్నె మల్లికార్జున, మల్లికార్జుననాయుడు, నాగమల్లయ్య, కిరణ్, శ్రీనాథ్, ప్రవీణ్, మారప్ప, హరి, భాను, లక్ష్మన్నలు పాల్గొన్నారు.

# రోడ్లేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందినట్లా..

బాదుడే బాదుడులో టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ

**పెద్దమండ్యం ఆగస్టు 6 ప్రభాతవార్త**



గ్రామాల్లోరోడ్లు వేసినంత మాత్రానా రాష్ట్రంఅభివృద్ధి చెందినట్లాఅని తెలుగుదేశం మండల అధ్యక్ష్యుడు వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని కలిచెర్ల, కోటకాడపల్లె, గుర్రంవాండ్లపల్లె, బండ్రేవు గ్రామాల్లో బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. కలిచెర్లలో తెలుగుదేశంపార్టీ జెండాను ఆవిష్కరించారు. జగన్ సర్కార్ మూడేండ్లపాలనలో అభివృద్ధి శూన్యమని నిత్యావసరధరలు బస్సుచార్జీలు, కరెంటు, ఇంటిపన్ను, చెత్తపన్ను, పెంచిపేదవాడి రక్తాని సోమ్ము చేసుకుంటున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. అభివృద్ధి చేసివుంటే గడపగడపకూ వెళుతున్న ఎమ్మెల్యేలను, మంత్రులను ఎందుకు నిదీస్తున్నారని ప్రశ్నించారు. పాలనచేతకాక రాష్టానికి పరిశ్రమలు ఒక్కటైనా వచ్చాయాఅని నిలదీశారు. పరిశ్రమలన్నీ తెలంగాణకు తరలి వెళుతున్నాయని మండిపడ్డారు. ఒక్కఛాన్స్అని అధికారమిస్తే ఉద్దరిస్తావని అనుకున్నారు. ఇలాధరలుపెంచి ప్రజాజీవనాన్ని అస్తవ్యస్తం చేసి రాష్టాన్ని అప్పులపాలు చేస్తావని అనుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ధరలు పెరుగుదలపై కాంగ్రెస్ నాయకులు ధర్నా

**మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



నిత్యవసర వస్తువులపై ధరల పెరుగుదలను నిరసిస్తూ శనివారం మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో బెంగుళూరు బస్టాండులో కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. ధరలు పెరుగుదలతో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధరలు పెంచిన ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో 8ఏళ్ళుగా బిజెపి పాలనలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గిరీష్‌కుమార్, పట్టణ అధ్యక్షులు రెడ్డిసాహెబ్, నాయకులు షంషీర్, శీనా, నజీర్, ఇంతియాజ్, వేమయ్య, రాజేష్, రెడ్డిబూ, శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

# టమోటా రైతులను ఆదుకోవాలని ధర్నా

**మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



టమేటా రైతులను ఆదుకోవాలని, మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విదానాన్ని రద్దు చేయాలని సిపిఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆసియాఖండంలోనే అతిపెద్ద మార్కెట్‌యార్డుగా ఉన్న టమోటా మార్కెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రైతులకు గిట్టుబాటుధర కల్పించి తక్షణం ఆదుకోవాలన్నారు. ధరలు లేక నష్టా ఊబిలో కూరుకుపోతున్న రైతులను ఆదుకొని ప్రభుత్వమే టమోటాలను కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారులను సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచేస్తున్నారన్నారు. అధికారులు స్పందించకపోతే మార్కెట్‌యార్డును ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామసుందర్, ఈశ్వర్ నాయుడు, మల్లికార్జున, నరసింహులు, హరేంద్రనాథ్‌శర్మ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైలుకింద పడి వ్యక్తి దుర్మరణం

**కురబలకోట, ఆగస్టు 6 ప్రభాతవార్త:**



కురబలకోట-సిటిఎం రైల్వేస్టేషన్ మద్యశనివారం కురబలకోట రైల్వేగేటు సమీపంలో బోయపల్లె వద్ద తిరుపతి వెలుతున్న నర్సాపురం ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృదేహం చిద్రమై పట్టాలపై పడింది. అతని జేబులో సూసైడ్ నోటు లభ్యమైంది. ఈ నోట్‌లో నా చావుకు ఎవరు కారణం కారని, తనంతటే తానే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఈ సంఘటనను తన తల్లి లక్ష్మిదేవమ్మ, తండ్రి గోపాల్‌రెడ్డికి తెలియజేయాలంటూ రాసిన సూసైడ్‌నోటు లభ్యమైంది. సంఘటన వద్ద మదనపల్లెకు చెందిన కాలువ రాజేష్‌రెడ్డి అనే ఏటిఎం లభ్యమైంది. మృతుడు మదనపల్లెకు చెందిన వాసిగా చెబుతున్నారు.

# గ్రామాభివృద్ధిపై శ్రద్ధ వహించాలి

**కురబలకోట, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఈఓపిఆర్‌డి అబ్దుల్‌సుఖుర్ అన్నారు. శనివారం ఎంపిడిఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, గ్రామసచివాలయ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో అంటురోగాలు ప్రభలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంటిపన్నులను నిర్ణీయిత గడువులోపు వసూలు చేయాలని కోరారు. గ్రామాభివృద్దిలో సర్పంచ్‌లు కీలకపాత్ర వహించాలని ఎంపిపి దస్తగిరిసాబ్ అన్నారు.

# విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

రెండవ అదనపు జిల్లా జడ్జి భాస్కర్‌రావు

**మదనపల్లెక్రైం, ఆగస్టు 6 ప్రభాతవార్త:**



విద్యార్థులు ఉన్నత శిఖాలను అదిరోహించాలన్నా, మంచి భవిష్యత్తు కావాలన్నా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి భాస్కర్‌రావు పేర్కొన్నారు. శనివారం జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలలో ఎస్ఈబి ఏఎస్ రాదాక్రిష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లు, డ్రగ్స్, మొబైల్స్‌లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కళాశాలలో ర్యాగింగ్ చేయడం,గంజాయి మొక్కలను పెంచడం వంటివి చేస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. మైక్రోసాఫ్ట్ కంప్యూటర్ కోర్సు చేస్తున్న 731మంది విద్యార్థులకు సర్టిఫికెట్లును జడ్జి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ పట్టణ సిఐ మురళీక్రిష్ణ, సుబద్ర, కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# గంగ రిజర్వాయర్‌కు చేరిన కృష్ణా జలాలు

గంగమ్మకు హారతి నిర్వహించిన ఎమ్మెల్యే

**దువ్వూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని చల్లబసాయపల్లె వద్ద గల తెలుగు గంగ ఎస్.ఆర్ రిజర్వాయర్-1కి శనివారం కృష్ణా జలాలు చేరాయి. రిజర్వాయర్‌లోకి నీరు రావడంతో స్థానిక ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, తెలుగు గంగ అధికారులు కలిసి రిజర్వాయరు వద్ద గంగమ్మకు జలాహారతులు నిర్వహించారు. నంద్యాల జిల్లాలోని వెలుగోడు ప్రాజెక్టు నుంచి తెలుగు గంగకు నీరు విడుదల చేయడంతో శనివారం చల్లబసాయిపల్లె రిజర్వాయరుకు 1390 క్యూసెక్కుల నీరు చేరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రోజు రోజుకు నీరు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు రావడంతో ముందుగానే ప్రాజెక్టులకు నీరు చేరిందని తెలిపారు. ఈనెల 14వ తేదీన రాజోలి నుంచి కేసీ కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి, జడ్పీటీసీ రామగోవిందరెడ్డి, హరినాథ్‌రెడ్డి, తెలుగు గంగ ఎస్సీ శారదా, ఈఈ బాలాజీ ప్రసాద్, డీఈఈ రమణ ప్రసాద్, కృష్ణారెడ్డి, ఏఈలు, మండల వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# విజయవంతంగా క్రికెట్ టోర్నీ

**కలికిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త**



కలికిరి-సోమల మార్గంలోని పొట్టేకుల వారిపల్లె వద్ద జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా జరుగుతోంది. శనివారం స్పార్టెన్ వారియర్స్ వర్సెస్ ఫీజర్ బుల్స్ టీంలు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న స్పార్టెన్ వారియర్స్ 19.4 ఓవర్లతో 10 వికెట్లు కోల్పోయి 184 రన్స్ చేశారు. ఫీజర్ బుల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 128 పరుగులు చేసి ఓటమిపాలైంది. స్పార్టెన్ టీంలో దినేష్ వర్మ(43రన్‌లు) ప్రవీణ్‌వాట్స్ 3వికెట్లతో రాణించాడు. ఫీజర్ బుల్స్ టీంలో విష్ణు(34 రన్‌లు), మహేష్ 4 వికెట్లు తీశారు. టోర్నీలో స్పార్టెన్ వారియర్స్ నిర్వాహకులు నవతేజ్‌రెడ్డి, దినేష్ రెడ్డి లు టోర్నమెంట్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి టోర్నీను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

# ట్రాన్స్‌కో అధికారుల చొరవతో సమస్య పరిష్కారం

**కలికిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త**



కలికిరి మండలం మర్రికుంటపల్లి పంచాయతీ గజ్జెలవాండ్లపల్లిలో ట్రాన్స్‌కో ఎఇ ముజీబుర్ రహిమాన్ చొరవతో విద్యుత్ లైన్ సమస్య పరిష్కారమైంది. గజ్జెలవాండ్లపల్లి గ్రామంలో విద్యుత్‌లైన్ సమస్యతో రెండు రోజులుగా మంచినీటి సమస్య తలెత్తింది. ఈ సమస్యను స్థానిక సర్పంచ్ రెడ్డిరామ్, కార్యదర్శి తిమ్మారెడ్డి లు ట్రాన్స్‌కో ఎఇ దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే ఎఇ స్పందించి విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. శనివారం లైన్‌మెన్ నరసింహులు, సిబ్బంది లైన్ ఏర్పాటు చేయడంతో మంచినీటి సమస్య పరిష్కారమైంది.

# మండల స్థాయిలో క్విజ్‌పోటీలు

**పెద్దమండ్యం ఆగస్టు 6 ప్రభాతవార్త**



ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మనోహర్ అన్నారు. ప్రథమ స్థానం, ద్వితీయ్య, తృతీయ్య స్థానాల్లో నిలిచిన వారికి 1వ తేదీన జిల్లాస్థాయి రాయచోటిలో పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలాదేవి ఎంపిడివో శ్రీధర్, ఇన్‌చార్జ్ హెచ్ఎం సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆజాదీకా అమృత మహోత్సవ క్విజ్ పోటీలు

**పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త :**



ఆజాదీకా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఓ నారాయణ, ఇన్‌చార్జ్ తహశీల్దార్ విద్యాసాగర్‌లు హాజరయ్యారు. శనివారం నిర్వహించిన క్విజ్‌పోటీల్లో రంగసముద్రం స్కూల్ విద్యార్థి మొదటి స్థానం సాధించగా, ఏపి మోడల్‌స్కూల్ ద్వితీయస్థానం, పిటిఎం జడ్పి హైస్కూల్ తృతీయస్థానం కైవసం చేసుకొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానంచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అత్యాచారం కేసులో ముద్దాయి అరెస్టు

**మదనపల్లెక్రైం, ఆగస్టు 6 ప్రభాతవార్త:**

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని మాయాబజార్‌లో కాపురమున్న జ్యోత్స అనే మహిళలను అదే వీధికి చెందిన క్రిష్ణప్ప అలియాస్ కిట్ట అతను అత్యాచారంకు పాల్పడ్డాడని రెండవ పట్టణ పోలీసులు ఫిర్యాదు చేసింది. క్రిష్ణప్ప మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు క్రిష్ణప్పపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. రెండవ పట్టణ సిఐ మాట్లాడుతూ పట్టణంలో ఇలాంటి వారు ఎవరైనా ఉంటే మహిళలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకొంటామని తెలిపారు.

# పండుగలా స్నేహితుల దినోత్సవం

**బద్వేలు అర్బన్, ఆగస్టు 06 ప్రభాతవార్త :**



స్థానిక తెలుగు గంగ కాలనీలో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల యందు పండుగలా స్నేహితుల దినోత్సవాన్ని విద్యార్థుల చేతుల మీదుగా ఘనంగా నిర్వహించడం జరిగింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పండుగ వాతావరణంతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొని ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లను కట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ రక్షాబంధన్ ఎంత బలంగా ఉంటుందో స్నేహితుల బంధం కూడా ఎప్పటికీ విడిపోని బంధం అని, జీవితంలో తోడు లేనిది ఒక్క స్నేహమే అని తెలియజేస్తూ ఎప్పుడు సమస్య ఎదురైనా ఆ సమస్యను ఒక్క స్నేహితుడితోనే పంచుకోవడమే కాకుండా ఎల్లవేళలా స్నేహితుడే తోడు ఉంటాడని పేర్కొన్నారు. ఇటువంటి స్నేహ బంధం ప్రతి ఒక్కరిలోనూ ఉంటుందని, అటువంటి స్నేహితులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎంలు చెన్నకేశవ రాజు, రామమోహన్ రెడ్డి, ఆర్ఐ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రఘురామిరెడ్డి, పావని, లలిత, అకాడమిక్ డీన్ శ్రీకాంత్ రెడ్డి, ఏవో కేశవ రెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండాలి

**ములకల చెరువు, ఆగస్టు 6, ప్రభాతవార్త:**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని వండాలని తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూలులో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం వండిన భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులకు తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. నాణ్యతలేని భోజనం వడ్డించినట్లు తమకు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కందుకూరులో మొహర్రం పండగ

నేడు పెద్ద పీర్ల ఊరేగింపు

**ములకల చెరువు, ఆగస్టు 6, ప్రభాతవార్త:**



మండలంలోని కందుకూరులో గత మూడు రోజుల నుంచి మొహర్రం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నెలవంక కనిపించడంతో అరబ్బీ క్యాలెండరు మొదటి నెల ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. కందుకూరు గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు కలిసి మెలసి చేసుకునే పండగా ప్రసిద్ధిగాంచింది. గ్రామస్థులు పీర్లను చావిడిలో కొలువు దీర్చారు. నాలుగు రోజుల నుంచి ప్రత్యేక ఫాతెహా చదివారు. ఆదివారం 8వ రోజు కావడంతో ప్రత్యేక పుష్పాలంకరణతో పీర్లను ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవం తిలకించడానికి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు.

# అభివృద్ధి పనులపై నాణ్యతా పరీక్షలకు సిద్ధమా..?

టీడీపీ నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

**కమలాపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త:**



నాలుగేళ్ల క్రితం తెదేపా ప్రభుత్వం హయాంలో నీరు-చెట్టు పథకం కింద కమలాపురం చెరువులో పూడిక తీత, తూముల్లో స్వెట్టర్ల ఏర్పాటు, ఐదో నెంబర్ స్లూయిస్‌కు డెలివరీ సిస్టం, నీరు అందించే సరఫరా చానెల్, డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ పనులు అంతే కాకుండా మీరాపురం సమీపంలోని పాగేరు వంకపై చెక్ డ్యాంల నిర్మాణం, పాగేరు వంకలో పూడిక తీత పనులను చేశామని ఈ పనుల పైన అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం, నాయకులు నాణ్యతా పరమైన పరీక్షలు చేసుకోవచ్చని అందుకు తాను సిద్ధమని కమలాపురం నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అంకిరెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా సవాల్ విసిరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇప్పటికే ఈ పనులపై మూడు సంస్థల ద్వారా మూడు సార్లు విచారించడం జరిగిందని, మూడు సంస్థల వారు నాణ్యతా ప్రమాణాల లోపం ఎక్కడా జరగలేదని అధికారులు నివేదికలు ఇచ్చినప్పటికీ సిగ్గు లేని ఈ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మాజీ తెదేపా యువత అధ్యక్షులు దివాకర్‌రెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, జంపాల నరసింహారెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, రామునిరెడ్డి, అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

# ఆజాదికా అమృత్ మహోత్సవ ర్యాలీ

**కమలాపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త:**



కమలాపురం మండలం సి.గోపులాపురం గ్రామంలో మండల పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలసి శనివారం ఉపాధ్యాయుడు కుమార్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ విశ్వనాథమ్మ, మహేష్‌కుమార్, ఏఎన్ఎం అరుణలు కలిసి ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గోపులాపురం వీధుల్లో మువ్వన్నెల జెండాలు చేత పట్టుకొని తిరిగారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా ధనం ఎక్కడ దుర్వినియోగం కాలేదు

వైస్ ఛైర్మన్ సాదిక్

**కమలాపురం, ఆగస్టు 6, ప్రభాతవార్త:**



ప్రజాధనం ఎక్కడా దుర్వినియోగం కాలేదని వైస్ ఛైర్మన్ సాధిక్ అన్నారు. శనివారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులపై చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. ప్రజా ధనం దుర్వినియోగం అయిందని ఎలా చెప్తారని ఆయన ప్రశ్నించారు. అప్రోచ్ రోడ్డు అనేది తాత్కాలిక రోడ్డు మాత్రమే అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కలెక్టర్ అందుకు సంబంధించిన ఆర్అండ్‌బీ అధికారులు, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా కలిసి ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మస్తాన్, షావలీ, జిలానీబాషా, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి పోటీతత్వంతో చదవాలి

**ములకల చెరువు, ఆగస్టు 6, ప్రభాతవార్త:**



ప్రస్తుత కాలంలో విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంఈవో వెంకటరమణ అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ములకల చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మండల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ములకల చెరువు, చౌడసముద్రం, సోంపల్లె, బురకాయలకోట, దేవలచెరువు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, మోడల్ స్కూల్, ఎస్‌పీబీవీ, సరస్వతి స్కూల్, శ్రీశారదా విద్యా మందిర్, వీఎస్ఆర్ స్కూలు, మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూలు తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఒక్కో టీంకు ముగ్గురు విద్యార్థుల చొప్పున 45 టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ క్విజ్ పోటీల్లో మండలంలోని వీఎస్ఆర్ స్కూలు, విస్డం స్కూలు, శ్రీసరస్వతి హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల స్థాయిలో ప్రజలు విద్యార్థులు ఈనెల 10న జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంఈవవో వెంకటరమణ, ఎంపీడీవో రమేష్ బాబు, తహసీల్దారు శ్రీనివాసులు అభినందించారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**బద్వేలు అర్బన్, ఆగస్టు 06 ప్రభాతవార్త :**



పట్టణంలోని సిద్దవటం రోడ్‌లో వెలసివున్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా ఆలయ అర్చకులు వీరేశాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి తెల్లవారుజామునే పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు పలు రకాల విశేష పూజలను శాస్రోక్తంగా నిర్వహించారు. అభిషేకం ప్రత్యేక ఉభయదాతలుగా మెంటా వెంకట నాగేంద్ర, సతీమణి సౌజన్య లక్ష్మి, సత్తారు మహీంద్ర, సతీమణి జానుతో పాటు సూరు సుబ్బారావుతో పాటు పలువురు ఉభయదాతలకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం : శ్రావణ శనివారం సందర్భంగా నెల్లూరు రోడ్‌లో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారుజామున ఆలయ అర్చకులు రమేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ బాదిరెడ్డి వెంకటరామి రెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ఓబులవారిపల్లె, ఆగస్టు 6, ప్రభాతవార్త:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో విజయారావు, తహసీల్దారు పీరూమున్నీ, ఎంఈవో పద్మజ పర్యవేక్షణలో పరిశీలించారు.

## అయ్యా... మాకు కేటాయించిన స్థలాలను ఇప్పించండి సారూ!

పూండ్లచెన్నుపల్లె గ్రామస్తుల ఆవేదన

బ్రహ్మంగారి మఠం, ఆగష్టు 06 ప్రభాతవార్త :



గత 15 సంవత్సరాల క్రితం 2007 సంవత్సరంలో ప్రభుత్వం సుమారు 70 మందికి కేటాయించిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించుకొని ఆన్‌లైన్ చేయించుకున్నారని, తమకు కేటాయించిన స్థలాలను అయ్యా మాకు ఇప్పించండి అని పూండ్లచెన్నుపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయం నందు ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2007 సంవత్సరంలో సర్వే నెం.246, 340 ల నందు ఒక్కొక్కరికి మూడు సెంట్లు ప్రకారం 70 మందికి అప్పటి ప్రభుత్వం మాకు కేటాయించి, అనుమతి పత్రాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. తమ కేటాయించిన స్థలంలో బేస్‌మట్టాలు కూడా ఏర్పాటు చేసుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై పలు మార్లు వీఆర్వోకు వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. ఆర్థిక స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేనిపక్షంలో కొందరు ఆక్రమించుకొని మాకు అన్యాయం చేశారంటూ తహసీల్దారుకు వినతిపత్రం అందించారు.

## వైద్య ఆరోగ్యశాఖలో అర్హత ఉన్న వారికి ఈనెల 25 లోపు పదోన్నతులు కల్పించండి

కడప కార్పొరేషన్, ఆగస్టు 6, ప్రభాతవార్త:



కడప నగరంలో వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డా. కోటేశ్వరమ్మను శనివారం ఏపీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివా సులు, కార్యదర్శి డి.రవికుమార్ కలిశారు. ఈనెల 25 లోపు రీజనల్ పరిధిలోని 24 క్యాడర్ ఉద్యోగుల పదోన్నతులు వెంటనే ఇవ్వాలని కోరారు. డా.కోటేశ్వరమ్మ మాట్లాడుతూ మా పరిధిలోని అన్ని క్యాడర్ల పదోన్నతులు సీనియారిటీ ప్రకారం తయారు చేశామన్నారు. ఈనెల 12 నుంచి 20వ తేదీలోపు అర్హులైన అందరికీ పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ అధ్యక్షుడు టి.తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు జి.వెంకటరెడ్డి, సిటీ అధ్యక్షుడు కె.చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి, పద్మనాభం పాల్గొన్నారు.

## కొలువుదీరిన పీర్లు..

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 6, ప్రభాతవార్త:



కుల మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా జరుపుకునే పండగ మొహరం అని మొహరం పురస్కరించుకొని మండలంలోని రెడ్డివారిపల్లి, దప్పేల్లి, సిద్దకవాండ్లపల్లి గ్రామాల్లో పీర్లు కొలువు దీరాయి. సిద్దగవాండ్లపల్లెలో కొండయ్య పీరు హుసేన్ పీరులు కొలువు దీరాయి. సోమవారం రాత్రి అత్యంత వైభవంగా ఉత్సవాలు జరుగుతాయని మంగళవారం సాయంత్రం జల్లికి వెళ్తాయని పీర్లు కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ ఛైర్మన్ విజయభాస్కర్, మాజీ మండల ఉపాధ్యక్షుడు సి.రామ చంద్రారెడ్డి, దేవదాసు, హుసేన్ బాషా, ఆదార్ బాషా, ముజార్‌బాష, వాసు దేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముర్రుపాలు బిడ్డకు శ్రేయష్కరం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 6, ప్రభాతవార్త:

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపిస్తే ఎంతో శ్రేయష్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తులసమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మద్దిరేవుల సెక్టార్ రవీంద్రనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు సన్నబిడ్డ తల్లులకు పాలు, గుడ్లు, ప్రభుత్వం అందిస్తున్న కిట్లు అందించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో బాలామృతం పిల్లలకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు రుక్మిణి, వాణి, శిరీష, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ

దువ్వూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త:



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రాథమిక వైద్యాధికారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తల్లిపాలు సరైన విధంగా ఇవ్వడానికి పలు సూచనలు చేశారు. పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా ముర్రుపాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. రోజుకు 8 నుంచి 12 సార్లు తల్లిపాలు ఇవ్వవచ్చని తెలిపారు. రాత్రి సమయంలో క్రమమైన పద్ధతిలో శిశువుకు పాలు ఇవ్వాలన్నారు. ఈ ర్యాలీలో వైద్యసిబ్బంది, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు. విజయకుమారి, శివరాం, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న తోడు లబ్దిదారులకు రుణాలు మంజూరు చేయాలి

ఎండీవో

ఓబులవారిపల్లె, ఆగస్టు 6, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లబ్ధిదారులకు రుణాలు పంపిణీ చేయాలని ఎండీవో విజయారావు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లను ఉద్దేశించి మాట్లాడుతూ జగనన్న తోడుకు సంబంధించిన దరఖాస్తులు మొత్తం 561 వచ్చాయని అందులో అర్హులైన లబ్ధిదారులు 102 మందికే రుణాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు త్వరగా రుణాలు పంపిణీ చేయాలని వెలుగు ఏపీఎం ఆర్మగం బ్యాంక్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు నాటు సారా తయారీ వ్యక్తులు అరెస్ట్

ఓబులవారిపల్లె, ఆగస్టు 6, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం గాదెల శివారు ప్రాంతంలో ఉన్న అరటి తోటలో ముగ్గురు వ్యక్తులు నాటు సారా కాస్తుండగా ఓబులవారిపల్లె ఎస్సై వెంకటేశ్వర్లు తన సిబ్బందితో దాడులు చేసి వారి వద్ద ఉన్న 5 లీటర్ల నాటు సారాను, ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## కేతరాజుపల్లెలో ర్యాలీ

పుల్లంపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త



పుల్లంపేట మండలం దళవాయిపల్లె పంచాయతి కేతరాజుపల్లె అంగన్వాడి సెంటర్ పరిధిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుదారపు నరేంద్ర, అంగన్వాడి కార్యకర్త సరోజ, ఇంకా అందరూ కలిసి తల్లిపాల వారోత్సవాల సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీలో తల్లిపాల విశిష్టత గురించి తెలియజెబుతూ బిడ్డ ప్రసవించిన వెంటనే ముర్రుపాలు తాపించాలని ఆ విధంగా తాపించిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులు, బాలింతలు, అంగన్వాడి పిల్లలు, కేతరాజుపల్లె ఎంపిఇఎస్ విద్యార్థిని విద్యార్థులు, ఆశావర్కర్‌లు, ఎఎన్ఎం తదితరులు పాల్గొన్నారు. శనివారం రోజున కేతరాజుపల్లెతో పాటు కొమ్మనవారిపల్లె, చాపల హరిజనవాడ అంగన్వాడి సెంటర్లలో కూడ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించినట్లు ఆ శాఖ మండల సూపర్‌వైజర్ తెలిపారు.

## ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా తదితర అక్రమాలకు టోల్ ఫ్రీ నెంబర్ 14500కు తెలపాలి

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప క్రైం, ఆగస్టు 6, ప్రభాతవార్త:

ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం, అక్రమ మద్యం తదితర అక్రమాల నియంత్రణకు టోల్ ఫ్రీ నెంబర్ 14500కు సమాచారం తెలపాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు అధికమయ్యాయని ప్రజలు ఇలాంటి నేరాల నియంత్రణకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. అందుకు టోల్ ఫ్రీ నెంబరును ప్రారంభించామని ప్రజలు 14500 నెంబరును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్రమాలకు అడ్డుకట్ట వేద్దామని ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

పెండ్లిమర్రి, ఆగస్టు 6, ప్రభాతవార్త:



బిడ్డకు తల్లిపాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టారు. బిడ్డ జన్మించిన వెంటనే తల్లి ముర్రుపాలు తాపించాలని తద్వారా బిడ్డకు ఆరోగ్యం, వ్యాధి నిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి తల్లి బిడ్డకు పాలివ్వాలని ఐసీడీసీ అధికారులు సూచించారు. బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమన్నా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గర్భవతులు, బాలింతలు, తల్లులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూళనే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త :



పేదరిక నిర్మూళనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శనివారం పట్టణంలోని 6వ వార్డు శివాజినగర్‌లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో అర్హులైన ప్రతి పేదవానికి లబ్ధిచూకూరుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నిరుపేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గడప గడప కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, డిఈ శిరీష, వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, కౌన్సిలర్లు ప్రసాద్, ఎస్‌వి. రమణ, మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్‌వి. శివారెడ్డి, శారదారెడ్డి, డిష్ రామక్రిష్ణారెడ్డి, నాయకులు రఫి, ఎస్.ఎ.కరీముల్లా, ఇర్ఫాన్‌ఖాన్, రహీం, క్రిష్ణ పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు చేస్తుండగా వ్యక్తి మృతి

అట్లూరు, ఆగస్టు 06 ప్రభాతవార్త :



మండలంలోని మన్యంవారిపల్లె సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు చేస్తుండగా కుంభగిరి గ్రామానికి చెందిన పాలకొండు యల్లారెడ్డి (32) ప్రమాదశాత్తు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే యల్లారెడ్డి విద్యుత్ పనులలో విద్యుత్ సిబ్బందికి సహాయ కూలీగా ఉండేవాడు. అయితే మన్యంవారిపల్లెలో సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల కోసం జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) రాజా, కమలకూరు సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ వెంకట రమణకు ఎల్‌సి తీసుకోవడం జరిగింది. అయితే లైన్‌మెన్, ఆపరేటర్ మధ్యలో ఏం జరిగిందో ఏమో గానీ సహచరుడుగా ఉన్న యల్లారెడ్డి మరమ్మత్తుల కొరకు ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్ షాక్ కొట్టడం జరిగింది. ప్రాథమిక చికిత్స కొరకు హుటాహుటిన బద్వేలు ఆసుపత్రికి తీసుకెళ్ళగా అప్పటికే మార్గ మధ్యలో మృతిచెందాడు. ఈ సంఘటన పై విద్యుత్ ఏడి రవి చంద్ర, డిఈ రామిరెడ్డి పరిశీలించడం జరిగింది. అయితే లైన్‌మెన్, ఆపరేటర్ మధ్య జరిగిన తప్పిదం వలన ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తుందని, పూర్తిగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

## జాతీయ లోక్‌అదాలత్‌లో బ్యాంకుల్లో పెండింగ్ కేసులు పరిష్కారం కావాలి

రాజంపేట అర్బన్, ఆగస్టు 6 ప్రభాతవార్త



ఈనెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో బ్యాంకుల్లో దీర్ఘకాలికంగా జరుగుతున్న కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని రాజంపేట 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్‌విఐఎస్ మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం కోర్టులో లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై రాజంపేట పట్టణంలోని బ్యాంకు మేనేజర్‌లతో సమావేశం నిర్వహించారు. కేసుల పరిష్కారానికి రాజీమార్గాన్ని మించిన మార్గం మరొకటి లేదని సూచించారు. దీనివల్ల ప్రజలు తమ కేసులను పరిష్కరించుకొంటారని, బ్యాంకుకు కూడ విలువైన సమయం కలిసి వస్తుందని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంకు మేనేజర్‌లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం

శ్రీకృష్ణ ధర్మరక్షణ వ్యవస్థాపక అధ్యక్షులు దుర్గారావు

చిట్వేలి, ఆగస్టు 6 ప్రభాతవార్త



చిట్వేలిలో శ్రీకృష్ణుని గ్రామోత్సవం నడిబొడ్డులో వెలసిన భువనేశ్వరి శ్యామాలంబ సమేత సోమేశ్వర స్వామి శివాలయం నుండి భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ మేరకు శ్రీకృష్ణ ధర్మరక్షణ వ్యవస్థాపక అధ్యక్షులు దుర్గారావు మైలపల్లె పంచాయతి ఎం.వడ్డిపల్లె గ్రామస్థుల ఆధ్వర్యంలో శనివారం చిట్వేలి శివాలయం నుండి ఎం.వడ్డిపల్లె వరకు శ్రీకృష్ణ విగ్రహాన్ని మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ వడ్డిపల్లె గ్రామంలో ఆదివారం శ్రీకృష్ణపరమాత్మ విగ్రహ ప్రతిష్ఠతో పాటు పురాతన కాలం నుండి అంతరించిపోతున్న సనాతన విద్యను ఇప్పుడున్నటువంటి హిందూ సమాజానికి తిరిగి పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ యొక్క కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం సమాజంలో చైతన్యవంతమైనటువంటి యువతను తయారు చేయాలని ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో గడప గడపకు తిరిగి హిందువులను చైతన్యపరుస్తామన్నారు. అలాగే ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణధర్మరక్షణ సభ్యులు, శివశక్తి సభ్యులు, ఎం.వడ్డిపల్లె గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక మొహరం

జడ్‌పి ఛైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట అర్బన్, ఆగస్టు 6 ప్రభాతవార్త

హిందూ ముస్లింలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిసి చేసుకొనే పండుగ మొహరం అని జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆకేపాడు, రాజంపేటలో జరిగిన మొహరం వేడుకల్లో పాల్గొన్నారు. మొహరం వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీతో ప్రజల ఇక్కట్లు

బద్వేలు రూరల్, ఆగస్టు 06 ప్రభాతవార్త :



పట్టణంలోని 13వ వార్డు డ్రైనేజీ సమస్యల గురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యారని వార్డు ప్రజలు వాపోతున్నారు. స్థానిక కౌన్సిలర్ టీడీపీ కావడంతోనేమో అన్ని వార్డులలో కనీసం సీసీ రోడ్లకు నోచుకున్నాయి కానీ, ఈ వార్డు మాత్రం ప్రజలు నడిచేందుకు కూడా వీలు లేకుండా డ్రైనేజీతో నిండి అధ్వాన్నంగా మారింది. కౌన్సిలర్ మహమ్మద్ హసన్ మాట్లాడుతూ 13వ వార్డు మహబూబ్ నగర్ వీధిలో గల డ్రైనేజీ సమస్య వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పలు మార్లు మున్సిపల్ ఛైర్మెన్‌కు, కమీషనర్‌కు వినతిపత్రాలు అందించడం జరిగిందని, చిన్న పిల్లలు, వృద్ధులు నడిచే సమయంలో జారి పడి కాళ్ళు, చేతులు విరిగే ప్రమాదం ఉందని గత 38 నెలలుగా ఇంటి ముందు కసువు చిమ్మేందుకు కూడా వీలు లేకుండా, ముగ్గు వేసేందుకూ కూడా అవకాశం లేకుండా దయనీయ స్థితి ఏర్పడిందని, ఈ సమస్యపై ప్రతి కౌన్సిల్ సమావేశంలో చర్చించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి 13వ వార్డు మహబూబ్‌నగర్ వీధిలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని 14వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాబడి ఉన్నా సమస్యను పూర్తి చేయకుంటే తీవ్ర స్థాయిలో నిరసన కార్యక్రమం చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## క్విజ్ పోటీలలో గురుకులానికే మొదటి స్థానం

రామాపురం, ఆగస్టు 6ప్రభాతవార్త:



ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల మొదటి స్థానంలో నిలిచినట్లు తహశీల్దార్ సత్యానందం తెలిపారు. స్థానిక ఎంపిడివో సభ భవనంలో ఆజాద కా అమృత్ మహోత్సవ భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆదర్శ పాఠశాల కేజీబివి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు నీలకంఠరావు పేట (తెలుగు) (ఉర్దూ) కుమ్మరపల్లి వెంకటేశ్వర స్కూల్ 10, 9, 8వ తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ సాంఘీకసంక్షేమ గురుకుల పాఠశాల ద్వితీయ స్థానంలో నీలకంఠరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) తృతీయ స్థానంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు నిలిచారు. మండల స్థాయిలో మొదటిస్థానం సాధించిన విద్యార్థులు ఈనెల 10వ తేదీన జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో నాగరత్నమ్మ, ఎంఈవో రామకృష్ణుడు, ఈవోపిఆర్డీ ఉషారాణి, ఏఎస్‌వో దుర్గ, ఆర్ఐ రెడ్డిబాబు, విద్యాశాఖ సిబ్బంది పాల్గున రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## త్వరితగతిన భూ రీసర్వే పూర్తి చేయాలి

సంబేపల్లి, ఆగస్టు 6ప్రభాతవార్త:



త్వరితగతిన భూ రీసర్వే పనులు పూర్తి చేయాలని సహాయ సంచాలకులు జయరాజు, ఏడి మునిస్వామి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నారాయణరెడ్డిగారిపల్లి సచివాలయంలో రీసర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని నారాయణరెడ్డి గారిపల్లి, సంబేపల్లి, గున్నికుంట్ల, రౌతుకుంట గ్రామాలలో డ్రోన్ల సహాయంతో భూ రీసర్వే నిర్వహించినట్లు తెలిపారు. గ్రౌండ్ ట్రైచింగ్ మూడు గ్రామాలలో పూర్తయినట్లు తెలిపారు. గున్నికుంట్ల, నారాయణరెడ్డి పల్లి, రౌతుకుంట గ్రామాల రికార్డులను మండల సర్వేయర్ సమక్షంలో తనిఖీ చేశారు. సంబేపల్లి గ్రామ రీసర్వే రికార్డులను పరిశీలించామన్నారు. గ్రామ సర్వేయర్లు గ్రామాలలో సర్వే పనులు త్వరగా పూర్తి చేయడానికి సూచనలు సలహాలు ఇచ్చారు. భూ రీసర్వేకి రైతులు, రెవెన్యూ అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపినాథ్, ప్రభాకర్, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా కోల్పోయిన వృద్ధులకు చేయూతనిస్తాం

బిజేఎస్ఆర్ కళాశాల అధ్యాపకుడు శంకర్ రెడ్డి

బద్వేలు అర్బన్, ఆగష్టు 06 ప్రభాతవార్త :



అనేక కారణాలతో ఆసరా కోల్పోయి వృద్ధాశ్రమాలను, అనాధాశ్రమాలను ఆశ్రయించిన వృద్ధులు, అనాధ పిల్లలను ఆదుకునేందుకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని డా॥ బిజేఎస్ఆర్ కళాశాల అధ్యాపక సిబ్బంది బైసాని శివ శంకర్ రెడ్డి, కల్లూరు మస్తాన్ రెడ్డి, బైసాని రవిశంకర్ రెడ్డి, సింగారపు రవి మరియు మన్యం రామమోహన్ రెడ్డి అన్నారు. ఇటీవల కాలంలో బిజేఎస్ఆర్ కళాశాల యాజమాన్యం బద్వేలు ప్రాంతంలో నిరుపేద ప్రజలకు చేయూతనివ్వడంలో వారి వంతు సహాయ సహకారాలు అందజేస్తూ పేదల పట్ల ఆసరాగా నిలుస్తున్నారు. ముఖ్యంగా శ్రావణ శనివారం సందర్భంగా బాకరాపేట వద్ద ఉండే పరమాత్మ సేవా తపోవన ఆశ్రమంలో ఉండే వృద్ధులకు భోజనం, తినుబండారాలు, పండ్లు అందజేస్తూ అక్కడ ఉన్న వృద్ధులను ప్రేమ, ఆప్యాయతగా పలకరిస్తూ వారి బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆసరా కోల్పోయిన వృద్ధులకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకర వ్యాధుల నుంచి పశువులను రక్షించుకొనేందుకు వ్యాక్సినే శ్రీరామరక్ష

డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ ఆరిఫ్

రాజంపేట అర్బన్, ఆగస్టు 6 ప్రభాతవార్త



వర్షాలు పడుతున్న ప్రస్తుత తరుణంలో పశువులకు ప్రమాదకర వ్యాధుల నుండి రక్షణకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ రాజంపేట డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ ఆరిఫ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని హస్తవరం పంచాయతిలో సర్పంచ్ హస్తవరం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం పశువులకు, మేకలకు వ్యాధినిరోధక టీకాలు వేసేందుకు కోట్ల రూపాయలు వెచ్చిస్తుందన్నారు. ఏ వ్యాధులు వచ్చినా తక్షణం పశుసంవర్ధకశాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.ప్రతాప్ మాట్లాడుతూ మనుషులకు ఆరోగ్యపరమైన ప్రమాదం సంభవించినప్పుడు 108లో ఎలా తరలిస్తున్నారో పశువులకు కూడ అదేవిధంగా అత్యవసర అంబులెన్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వెల్లడించారు. 1962 నంబరుకు ఫోన్ చేసినట్లయితే తక్షణమే పశువుల అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకొంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లె పశువైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి, జెవిఒ వరదయ్య, పశువైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

పెండ్లిమర్రి, ఆగస్టు 6, ప్రభాతవార్త:



ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని స్పెషల్ కలెక్టర్ చంద్రమోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పెండ్లిమర్రి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఓటు కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి ఓటు కార్డు కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయంలో ఓటు కార్డుకు ఆధార్ నమోదు చేసుకోవాలని బీఎల్‌ఓలు తప్పనిసరి చేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయభాస్కర్ రాజు, ఎంపీడీవో రమణారెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు

మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామి రెడ్డి

బ్రహ్మంగారి మఠం, ఆగష్టు 06 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గడిచిన 3 సంవత్సరాల కాలంలో పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కటే అని మైదుకూరు నియోజకవర్గ శాసన సభ్యులు శెట్టిపల్లి రఘురామి రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయం-2 పరిధిలోని గ్రామాలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు జడ్పీటీసి ముత్యాల రామగోవింద రెడ్డి, మండల అధ్యక్షులు చిలేకాంపల్లి వీరనారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం రవీంద్ర నగర్, గొల్లపల్లె, సోమిరెడ్డిపల్లె, కొండువారిపల్లె గ్రామాలలో గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారా అంటూ ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య, ఎంపీటీసి యల్లటూరు ఈశ్వర్ రెడ్డి, యల్లటూరు శివారెడ్డి, మల్లిఖార్జునరెడ్డితో పాటు మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా రక్త పరీక్షలు

పోరుమామిళ్ళ రూరల్, ఆగస్టు 6ప్రభాతవార్త:



డాక్టర్ ఎస్.వి.వి. ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరికుంట్లలోని కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచితంగా విద్యార్థిల యొక్క గ్రూపు, రక్తశాతం క్యాంప్‌ను నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ సర్జన్ డాక్టర్ ఎస్. కళ్యాణ చక్రవర్తి పాల్గొని రక్త గ్రూపు ప్రాధాన్యతను, విద్యార్థినిలకు రక్త శాతం వంటి వాటిపై అవగాహన, విద్యార్థులు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెటలియజేశారు. ఈ కార్యక్రమంలో కోడిగుడ్ల పాడు ప్రధాన ఉపాధ్యాయుడు సాంబశివారెడ్డి, టీచర్ రోసిరెడ్డి, పాఠశాల ఏవో సుప్రజ, నౌజియా, ఉపాధ్యాయులు సతీషు నానిలు పాల్గొన్నారు.

## ఇమామ్ ఖాసీం పీర్ల మెరవణి

చిన్నమండెం, ఆగస్టు 6ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని పీర్లమకాన్‌లో కొలువైన ఇమామ్ ఖాసీం పీర్లను శనివారం పురవీధులలో ఊరేగించారు. మోహరం ఉత్సవాల్లో భాగంగా పీర్లను వివిధ వేషదారణల మధ్య పాత స్టేట్ బ్యాంకు వరకు అంగరంగ వైభవంగా ఊరేగించారు. తిరిగి పీర్లమకాన్‌లో కొలువు తీర్చారు. రాత్రి హుసేని ఆలయం పీరును గంధం మెరవని తీసి అగ్నిగుండాలను కాల్చారు. ఆదివారం చిన్నపిల్లలకు ఆటిలు కట్టడం జరుగుతోంది. అలాగే పిల్లలు లేని వారు ముడుపులు కట్టుకోవాలని కమిటీ సభ్యులు తెలియజేశారు.

## లక్ష్మీ నరసింహునికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం, ఆగస్టు 6ప్రభాతవార్త:



మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె సమీపంలో మాండవ్యనది వడ్డున వెలసిన మండెం రాయుడుగా పిలుసుకొనే లక్ష్మీనరసింహ స్వామికి శ్రావణమాసం రెండవ శనివారాన్ని పురస్కరిం చుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకాలు చేసి రంగు రంగుల పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. మండల వాసులే కాక సమీప మండలాల నుండి వచ్చిన భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కుకొని తరించారు.

## గ్రంథాలయానికి 1440 కొత్త బుక్కులు

చిన్నమండెం, ఆగస్టు 6ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని గ్రంథాలయానికి 1440 కొత్త బుక్కులు వచ్చినట్లు నిర్వాహకుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. వీటిలో పురాణ పుస్తకాలు, నవలలు, పిల్లల కథల పుస్తకాలు ఉన్నాయన్నారు. కావున ప్రజలు, పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త బుక్కులు మంజూరు చేసిన గ్రంథాలయ ఛైర్మెన్, సెక్రటరీ, అధికారులకు నిర్వాకుడు కృతజ్ఞతలు తెలిపారు.

## మురిపాలు అమృతంలో సమానం

రామాపురం, ఆగస్టు 6ప్రభాతవార్త:



పుట్టిన నవ శిశువుకు తల్లి మురిపాలు అమృతంతో సమానమని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పద్మావతమ్మ అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీలోని అంగన్వాడి కేంద్రంలో శనివారం తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలే ఇవాళ అన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా నెలవారి సూదలు తీసుకోవాలని అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది సూచించి ఆరోగ్య సలహాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు పద్మజారాణి, అరుణ్‌కుమారి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది, గర్భవతులు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

## రెండు వేర్వేరు కేసుల్లో ఇరువురిపై దాడి..

వన్‌టౌన్‌లో హత్యాయత్నం కేసు నమోదు

కడప క్రైం, ఆగస్టు 6, ప్రభాతవార్త:

కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన 2 వేర్వేరు కేసులకు సంబంధించి ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద బహిర్భూమి కోసం ఆజాద్ నగర్‌కు చెందిన హనీఫ్ అనే వ్యక్తి రైల్వే పోలీసుస్టేషన్ పక్కనే ఉన్న బాత్‌రూం వద్దకు వెళ్లగా అక్కడే ఉన్న రాజేష్, మధు అనే ఇరువురు వ్యక్తులు హనీఫ్ అతని స్నేహితునిపై దాడి చేసి కత్తులతో దాడి చేసి గాయపరిచి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదును అపహరించారు. బాధితుడు హనీఫ్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అతని పిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై సిద్దయ్య హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అలాగే స్థానిక ఎర్రముక్కపల్లె చౌడేశ్వరీ గుడి సమీపంలో షేక్ మస్తాన్ అనే వ్యక్తిపై అతని స్నేహితుడు వెంకట్ కత్తితో దాడి చేసి శనివారం గాయపరిచాడు. మస్తాన్ ఎర్రముక్కపల్లె సమీపంలోని పల్లా చౌదయ్యవీధిలో నివాసం ఉంటున్నాడు. పక్కవీధిలో అతని స్నేహితుడు వెంకట్ ఉంటున్నాడు. వీరు మంచి స్నేహితులు అయితే మస్తాన్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని వెంకట్ శుక్రవారం తీసుకెళ్లి ఇవ్వకపోడంతో మస్తాన్ అతని వద్దకు వెళ్లి తన వాహనాన్ని ఇవ్వాలని అడగగా తన ఇంటి వద్దకు వచ్చి మస్తాన్ వాహనాన్ని అడగడంతో కోపంతో తన ఇంటి వద్దకే వచ్చి అడుగుతావా అని కత్తితో దాడి చేశాడు. స్థానికులు 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ నాగరాజు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మండలంలో పొలంబడి కార్యక్రమం..

పెండ్లిమర్రి, ఆగస్టు 6, ప్రభాతవార్త:

మండలంలోని తుమ్మచెట్లపల్లిలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేరుశనగపై రైతులకు ఏవో బ్లెస్సీ అవగాహన కల్పించారు. పురుగు మందుల గురించి, వేరుశనగలో చుట్టు మొక్కజొన్న కానీ, జొన్న కానీ వేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి, ఎం45తో చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మజ (డీఆర్‌సీ), ఏఈఓ గంగాధర్‌రెడ్డి, గంగాప్రసాద్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.